
Follow: @ANNTELUGU
25-08-2026
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 231 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## కాస్త ఆలస్యమైనా నదుల అనుసంధానం పక్కా

- ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- నాలుగు రాష్ట్రాల్లో నీటి సమస్యకు పరిష్కారం : చంద్రబాబు

**ఏలూరు, మహా :** నూజివీడు నియోజకవర్గంలోని ముసునూరులో నాన్ జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని సీఎం చంద్రబాబుతో కలిసి ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'నేను తెలుగు అర్థం చేసుకోగలను, కానీ మాట్లాడలేను. రెండు నెలల క్రితం తమిళ పత్రికలో గౌర్మెట్ సంస్థ ఎండీ పట్టాభి సక్సెస్ స్టోరీని చదివాను. ఒకే ఒక ఉత్పత్తిని ప్రపంచంలోనే గుర్తింపు తీసుకురావడంపై ఆయనను అభినందిస్తున్నాను. జనవరి 14న దేశమంతా కలిసి పంటల పండుగను జరుపుకుంటాం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో సంక్రాంతిగా, తమిళనాడులో పొంగల్, పంజాబ్‌లో లోహిరి, అసోంలో బిహుగా జరుపుకుంటారు' అని చెప్పుకొచ్చారు. రైతులకు వివిధ పథకాలను అమలుచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను

మిగతా 2వ పేజీలో

02

టాప్ న్యూస్

### క్రమశిక్షణ కమిటీ నిర్ణయమే ఫైనల్



- ఊహాజనిత కథనాలపై స్పందించబోనని స్పష్టం
- కొండాసురేఖ ఇష్యూపై సీఎం క్లారిటీ

02

### ఫైడే పార్టీ



- వచ్చే శుక్రవారం కొత్త పార్టీని ప్రకటిస్తా
- మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటన
- ఏపీలో బాబు, జగన్ ఇద్దరూ ఫెయిల్

02

### చంచల్‌గూడ జైలుకు మాజీ మంత్రి కారుమూరి



- రెండువారాల రిమాండ్ విధించిన కోర్టు

02

## మోదీ పాక్ వెళ్లొచ్చు..
# మేం అమెరికా వెళ్లకూడదా?



### తెలంగాణపై ఏంటీ వివక్ష?

- గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. నన్ను అడ్డుకుంటారా?
- పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్న మోదీ
- ఇది 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైర్
- పార్లమెంట్ లోనూ దీనిపై నిలదీస్తాం

**హైదరాబాద్, మహా :** నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. వికసిత్ భారత్ లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 2047 పేరిట పెట్టుబడుల ఆకర్షణకు తలపెట్టిన తన అమెరికా పర్యటనను కేంద్రం అడ్డుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు

మిగతా 3వ పేజీలో

### సెప్టెంబర్ 7 నుండి అసెంబ్లీ సమావేశాలు

ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి



03




# కదులుతున్న అక్రమాల డొంక..!

- శంషాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమాల గుట్టురట్టు..!
- పెద్ద షాపూర్‌లో మరో సంచలన డాక్యుమెంట్ వెలుగులోకి..!
- డాక్యుమెంట్ నెంబర్ . 372/2026 ..!
- నాలా కన్వర్షన్ లేకుండానే 20 గుంటల వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా రిజిస్ట్రేషన్..!
- మూడు ప్లాట్లుగా విభజించి 1,815 చదరపు గజాలుగా నమోదు..!
- తొండుపల్లి సర్వే నెంబర్లు 211, 212లో 5.15 ఎకరాలకు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్..!
- నాలా కన్వర్షన్ లేకుండానే డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు..!
- రిజిస్ట్రేషన్ జీఓ 257, జీవో 111 ఎం.ఏ నిబంధనలకు తూట్లు పొడుస్తూ 26,124 చదరపు గజాల రిజిస్ట్రేషన్..!
- డాక్యుమెంట్ నెం. 197/2026 గా నమోదు..!
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి..!
- డాక్యుమెంట్ నెం. 197/2026, 372/2026 లతో పాటు ఇంటి నంబర్లు, పి టి ఐ ఎన్ నంబర్లను రద్దు చేయాలి...!
- బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికుల డిమాండ్..!

02

శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తీగ లాగిన కొద్దీ అక్రమాల డొంక కదులుతోంది.. పెద్దషాపూర్ గ్రామానికి చెందిన డాక్యుమెంట్ నెంబర్ 372/2026 గా నమోదైన మరొక అక్రమ రిజిస్ట్రేషన్ వెలుగులోకొచ్చింది.. నాలా కన్వర్షన్ లేకుండానే 20 గుంటల వ్యవసాయ భూమిని 3 ప్లాట్లుగా విభజించి, 1,815 చదరపు గజాల విస్తీర్ణానికి డాక్యుమెంట్ నంబర్ 372/2026 ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేయడం వారి అవినీతి అక్రమాలకు పరాకాష్టగా నిలుస్తుంది.. రియల్ మాఫియాతో కుమ్మక్కైన జూనియర్ అసిస్టెంట్ నజిరుద్దీన్, ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్ వికాస్ రెడ్డి రిజిస్ట్రేషన్ జీవో 257, జీవో 111 ఎం.ఏ నిబంధనలకు తూట్లు పొడుస్తూ నాలా కన్వర్షన్ లేకుండానే ప్రభుత్వ ఆధాయానికి బారీగా గండి కొడుతూ వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా అక్రమ రిజిస్ట్రేషన్ లు చేస్తూ అక్రమ సంపాధనే ధ్యేయంగా తెగబడుతున్నారు.. ఓ టి ఎన్ జీ ఓ నాయకుడు అక్రమార్కులకు అండగా నిలువడంతో వారి అవినీతి, అక్రమ సంపాధనకు హద్దే లేకుండా పోతుందని బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## 22ఏపై ప్రతిపక్షాల 'అబద్ధాల ప్రచారం'

- జెన్యూన్ భూముల రిజిస్ట్రేషన్లకు అడ్డంకి లేదు.
- దొంగ జీవోలతో ఒత్తిడి చేస్తే కేసులే.
- రెవెన్యూ మంత్రి పొంగులేటి ఫైర్



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల వ్యవహారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 22ఏపై కొత్త కథలు అల్లి ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో రిలాక్స్ ఇచ్చిన వాటికి క్లియరెన్స్ ఇచ్చామని, వాస్తవంగా అర్హత ఉన్న భూముల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేశామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భూములకు మాత్రం రిజిస్ట్రేషన్ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి మాట్లాడుతూ.. 22ఏ అంశంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. నిజమైన భూముల విషయంలో ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు సృష్టించడం లేదన్నారు. అర్హత ఉన్న

మిగతా 3వ పేజీలో



03

### కేబుల్ ఛానళ్ళ సమస్యలు పరిష్కరించండి

- ఐపీ టీవీలకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి
- మీడియా అకాడమీ ఛైర్మెన్ కు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి

### ఫుట్‌పాత్ ప్రజల హక్కు.. ఆక్రమిస్తే ఊరుకోం!

- దేశవ్యాప్తంగా రాష్ట్రాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు.
- పాదచారుల కోసం ప్రత్యేక స్థలం తప్పనిసరి.

03



### ఎస్ఐఆర్ ఫేజ్ 2 లో మరింత అప్రమత్తంగా ఉండాలి

- అర్హుల ఓటు ఒక్కటి కూడా పోకుండా చూడాలి
- సమీక్షా సమావేశంలో కంది శ్రీనివాస రెడ్డి పిలుపు

**ఆదిలాబాద్ మహా :** ఎస్ఐఆర్ ఫేజ్ 2 లో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి శ్రేణులకు సూచించారు. సోమవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎస్ఐఆర్ తదుపరి ప్రక్రియ పై జరిగిన సమీక్షా సమావేశానికి ఆయన తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి తో కలిసి హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేసారు. ఎస్ఐఆర్ తో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో 39వేల ఓట్లు పర్మినెంట్ షిఫ్టింగ్, డెత్, గైర్హాజరు వలన నమోదు కాలేదన్నారు


మిగతా 3వ పేజీలో



### ఏపీకి రూ.32 వేల కోట్ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్!

- తూర్పు భారత్‌తో అమరావతికి కొత్త రహదారి.
- అరకు నుంచి రాజధాని వరకు ఆర్థిక 'గేట్‌వే'.
- వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యానికి భారీ ఊతం.
- 1,107 కి.మీ. కారిడార్‌లో ఏపీలో 457 కి.మీ.

02



# క్రమశిక్షణ కమిటీ నిర్ణయమే ఫైనల్

**కొండాసురేఖ ఇష్యూపై సీఎం క్లారిటీ**

**హైదరాబాద్, మహా :** మంత్రి కొండా సురేఖ అంశం క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ నిర్ణయాన్ని అందరూ అంగీకరించాల్సిందేనని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కొండా సురేఖ అంశంపై స్పందించారు. అధిష్ఠానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని పేర్కొన్నారు. అంతర్గత వ్యవహారాలపై మాట్లాడనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అలాగే ఊహాజనిత కథనాలపై స్పందించనని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు.

# చంచల్‌గూడ జైలుకు మాజీ మంత్రి కారుమూరి

**రెండువారాల రిమాండ్ విధించిన కోర్టు**

**హైదరాబాద్ సిటీ, మహా :** ఏపీ మద్యం రవాణా కేసులో అరెస్ట్ అయిన మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు కోర్టు రిమాండ్ విధించింది. సోమవారం ఉదయం కారుమూరి నాగేశ్వరరావును ఈడీ అధికారులు హైదరాబాద్ ఈడీ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు రెండు వారాల రిమాండ్ విధించింది. దీంతో చంచల్ గూడా జైలుకు తరలించారు. మరోవైపు లిక్కర్ రవాణా కేసులో నిందితుడిగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు.

# ఫైడే పార్టీ

**విజయవాడ, మహా :** తాను కొత్త పార్టీని ప్రారంభించపోతున్నట్టు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సోమవారం మరింత స్పష్టత ఇచ్చారు. శ్రావణమాసం మూడో శుక్రవారం నాడు తన నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పేరు, జెండా, విధివిధానాలు మరియు పూర్తి ప్రణాళికను విజయవాడ వేదికగా అధికారికంగా వెల్లడిస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై పోరాడేందుకు, ప్రజల తరపున గొంతుక వినిపించేందుకు చట్టసభల్లో ప్రత్యేకంగా ప్రతిపక్ష హోదా ఏమీ అవసరం లేదని విజయసాయి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ మాత్రమే ఏకైక ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. సాధారణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సమస్యలను నేరుగా సభల వరకు తీసుకెళ్లేందుకు ఒక బలమైన స్వతంత్ర రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు. ఒకప్పుడు వైసీపీలో కీలక పాత్ర పోషించి జగన్ తర్వాత సెకండ్ ప్లేస్ లో ఉన్న విజయసాయి ఆ తర్వాత పార్టీని వీడిన విషయం తెలిసిందే. పార్టీని వీడిన సమయంలో తాను రాజకీయాలకు శాశ్వతంగా దూరమవుతున్నట్లు ప్రకటించి కొన్నాళ్లు స్థబ్దుగా ఉన్న విజయసాయి ఆ తర్వాత క్రియాశీల రాజకీయాల వైపు అడుగులు వేస్తుండటం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది.

# అదృశ్యమైన యువతి ఆచూకీ టెక్నాలజీతో ఛేదన

- **యువతిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు**
- **యువకుడి పై కేసు**

**కారేపల్లి,మహా :** కారేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు నెలల క్రితం అదృశ్యమైన యువతి విషయమై మిస్సింగ్ కేసు నమోదు చేసిన కారేపల్లి పోలీసులు టెక్నాలజీని ఉపయోగించి యువతి ఆచూకిని ఛేదించారు. దీనికి సంబంధించి కారేపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని భల్లునగర్ తండాకు చెందిన ఓ యువతి అదృశ్యమైందని మే నెలలో ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. యువతి ఫోన్ లేకుండా వెళ్లడంతో ట్రేస్ చేయడం ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో కారేపల్లి ఎస్ఐ గోపి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి యువతి ఆచూకీని కనిపెట్టారు. యువతిని ప్రేమ, పెళ్లి పేరుతో హైదరాబాదుకు చెందిన రుకుమ్ మాయ మాటలతో మోసం చేసి తీసుకెళ్లాడు. యువతి ఆచూకి కనిపెట్టిన పోలీసులు సోమవారం ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడైన యువకుడు రుకుమ్ పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు కారేపల్లి ఎస్ఐ గోపి తెలిపారు

# కదులుతున్న అక్రమాల డొంక..!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కేంద్రంగా సాగుతున్న భూ రిజిస్ట్రేషన్ల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. తీగ లాగితే డొంక కదిలినట్లు.. ఒక్కో డాక్యుమెంట్‌ను పరిశీలిస్తున్న కొద్దీ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన లావాదేవీలు వెలుగులోకి వస్తున్నాయి. నాలా కన్వర్షన్ లేకుండానే వ్యవసాయ భూములను ప్లాట్లుగా విభజించి రిజిస్ట్రేషన్లు చేయడం, డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు నమోదు కావడం వంటి అంశాలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

పెద్ద షాపూర్‌లోని డాక్యుమెంట్ నెం. 372/2026లో 20 గుంటల వ్యవసాయ భూమిని మూడు ప్లాట్లుగా 605 చదరపు గజాల చొప్పున విభజించి 1,815 చదరపు గజాలుగా నమోదు చేసిన వ్యవహారం, తొండుపల్లి సర్వే నంబర్లు 211, 212లో 5.15 ఎకరాలకు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్, అలాగే 26,124 చదరపు గజాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం. 197/2026గా నమోదు కావడం వెనుక భారీ మొత్తంలో ముడుపులు ముట్టినట్లు తెలుస్తోంది.

భూమి స్వభావం, నాలా కన్వర్షన్, ప్లాట్ల విభజన, రిజిస్ట్రేషన్‌కు సమర్పించిన అనుమతులు, అనంతరం జారీ అయిన ఇంటి నంబర్లు, పీటీఐఎన్‌లను సమగ్రంగా పరిశీలిస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. "పొలం ఉండగా ప్లాట్లు ఎలా పుట్టుకొచ్చాయి..? ఎలాంటి లేఅవుట్ అనుమతులు లేకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


**పెద్ద షాపూర్‌లో మరో సంచలన డాక్యుమెంట్ వెలుగులోకి..!**

తొండుపల్లి భూ అక్రమాల భాగోతం నడుస్తుండగానే, అదే కార్యాలయం పరిధిలోని పెద్ద షాపూర్ గ్రామంలో జరిగిన మరో ఘోర ఉల్లంఘనకు సంబంధించిన సంచలన అధికారిక పత్రాలు 'మహా' పత్రిక, ఏ ఎన్ ఎన్ న్యూస్ సంయుక్తంగా జరిపిన ఇన్వెస్టిగేషన్‌లో వెలుగులోకి వచ్చాయి. రికార్డుల ప్రకారం డాక్యుమెంట్ నెంబర్ 372/2026 గా నమోదైన ఫైల్, ఇక్కడి అవినీతి, అక్రమ రిజిస్ట్రేషన్ లకు ఎంతలా వేరూనుకుందో స్పష్టమవుతోంది .

**నాలా కన్వర్షన్ లేకుండానే 20 గుంటల వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్..!**

పెద్ద షాపూర్ పరిధిలోని సర్వే నంబర్ 241/సి లో ఉన్న 20 గుంటల ప్యూర్ అగ్రికల్చర్ (వ్యవసాయ) భూమిని నాన్‌అగ్రికల్చర్ (వ్యవసాయేతర) కింద మార్చకుండానే జనవరి 16, 2026న సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసేశారు. ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయల నాలా ఫీజును ఎగ్గొట్టేందుకు పక్కా స్కెచ్ వేశారు. 16 జనవరి 2026 న నమోదైన సేల్ డీడ్ ప్రకారం.. హైదరాబాద్ హైదర్‌గూడ కేంద్రంగా పనిచేస్తున్న ఎమ్/ఎస్ సిండికేట్ హౌసింగ్ అండ్ డెవలపర్స్ (భాగస్వామి: చిట్టేడి నారాయణరెడ్డి) ప్రతినిధులు, శంషాబాద్ గ్రామానికి చెందిన కలినా తేజస్వి (తండ్రి: కలినా సిద్దేశ్వర్) పేరిట డాక్యుమెంట్ నంబర్ 372/2026 ద్వారా కేవలం రూ. 38,11,500 మార్కెట్ విలువ చూపిస్తూ భూ లావాదేవీలు జరిపినట్లు సేల్ డీడ్ పత్రాల ద్వారా స్పష్టమవుతోంది.





भारतीय गैर न्यायिक
पचास रुपये ₹.50 FIFTY RUPEES Rs.50
INDIA NON JUDICIAL
తెలంగాణ TELANGANA
SALE DEED

S.R.O. Shamshabad, R.R District by:

M/s. SYNDICATE HOUSING AND DEVELOPERS, Having Office at Room No. 215, IInd Floor, Paras Chambers, Hyderguda, Hyderabad, Represented by its Partner SRI. CHITTEDI NARAYANA REDDY, S/o CHITTEDI RAM REDDY, aged about 85 Years (D.O.B. 12/06/1940), Occupation: Business, R/o Kukatpally, Hyderabad, Presently Residing at House No. 12-1-533/19, Plot No.19, Sravani Sri Enclave, Bandlaguda, Near Anand Nagar X Road, Nagole, L B Nagar, R.R.District-500 068. PAN [redacted] Aadhaar Card No. [redacted]

Hereinafter called the "VENDOR" of the first part which term shall mean and include all it's legal heirs, executors, administrators, legal representatives, nominees, and assigns etc.

IN FAVOUR OF

KALINA TEJASWI, D/o KALINA SIDDESHWAR, Aged about 26 Years (D.O.B. 19/12/1999), Occupation: House Hold, R/o House No. 1-46, Pochhamma Gadda, Shamshabad Village and Mandal, R.R District-501 218. PAN [redacted] Phone No. 9347251146. Aadhaar Card No. [redacted]

Hereinafter called the "VENDEE" of the second part which term shall mean and include all her heirs executors, administrators, legal representatives, nominees, and assigns etc.,

Cont.........2..

**మూడు ప్లాట్లుగా విభజించి 1,815 చదరపు గజాలుగా నమోదు..!**

ఇక్కడే అధికారిక రికార్డుల లూప్‌హోల్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి. అగ్రికల్చర్ ల్యాండ్‌ను ప్లాట్లుగా మార్చకూడదనే నిబంధన ఉన్నప్పటికీ, ఆ 20 గుంటల భూమిని మూడు ప్లాట్లుగా ఒక్కో ప్లాటును 605 చదరపు గజాలుగా విభజించి, 1,815 చదరపు గజాల ఓపెన్ ప్లాట్లుగా (ప్లాట్ నంబర్లు: 1, 2, 3) రికార్డుల్లో నమోదు చేశారు. ఈ అక్రమానికి ప్రభుత్వ ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌ను సైతం దుర్వినియోగం చేసినట్లు ఆధారాలు చెప్తున్నాయి. అప్లికేషన్ నంబర్ G/RSPR/001975/2020 తో కలిగిన తేజస్వి పేరిట కంప్యూటరైజ్డ్ పేమెంట్ రసీదు సృష్టించారు. ఇందులో రెగ్యులరైజేషన్ ఛార్జీలు రూ. 2,27,635 చెల్లించినట్లు చూపగా, చెల్లించాల్సిన 14% ఓపెన్ స్పేస్ ఛార్జీలు రూ. 5,33,610 (నాట్ పైడ్) అని స్పష్టంగా ఉన్నా, పెండింగ్ బ్యాలెన్స్ ఉన్నా సరే రిజిస్ట్రేషన్ ఫైల్స్ క్లియర్ చేసేశారు. 'ఈ రసీదు క్రమబద్ధీకరణకు ఎలాంటి హక్కును కల్పించదు" అని రాసి ఉన్నా సరే, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఆ నిబంధనను పక్కనబెట్టి, దానిని ఒక 'అప్రూవ్డ్ లేఅవుట్' లాగా చూపిస్తూ రిజిస్ట్రేషన్లు కానిచ్చేశారు. ఆ తర్వాత జూలై 2026 లో ఈ 1,815 గజాల నుండి ప్లాట్ 2 (605 గజాలు) ను షేక్ బషీర్ అహ్మద్‌కు (డాక్యుమెంట్ 5445/2026), ప్లాట్ 3 తూర్పు భాగం (210 గజాలు) ను షేక్ రఫీక్ రషీద్ అహ్మద్‌కు (డాక్యుమెంట్ 5446/2026) అక్రమంగా విక్రయించి వరుస సబ్‌రిజిస్ట్రేషన్లు కూడా కానిచ్చేశారు.





**తొండుపల్లి సర్వే నెంబర్లు 211, 212లో 5.15 ఎకరాలకు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్..!**


ఇక ఈ కుంభకోణానికి ప్రధాన కేంద్రంగా మారిన తొండుపల్లి గ్రామంలోని సర్వే నెంబర్లు 211 మరియు 212 లలో ఏకంగా 5.15 ఎకరాల (5 ఎకరాల 15 గుంటల) భారీ విస్తీర్ణంలో ఉన్న ల్యాండ్‌ను రియల్ మాఫియా టార్గెట్ చేసింది. నాలా కన్వర్షన్ లేకుండానే ఈ 5.15 ఎకరాల భూమికి వరుసగా డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు జరిపించేశారు.

**రిజిస్ట్రేషన్ జీఓ 257, జీవో 111 ఎం.ఏ నిబంధనలకు తూట్లు.. 26,124 చదరపు గజాల రిజిస్ట్రేషన్..!**

ఈ సర్వే నంబర్లలోని ల్యాండ్‌కు సంబంధించి.. రిజిస్ట్రేషన్ల నిబంధనల జీఓ 257ను, అలాగే జీఓ 111 ఎం.ఏ (మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) నిబంధనలను పూర్తిగా కాలరాశారు. ఈ పర్యావరణ పరిరక్షణ చట్టాలను తుంగలో తొక్కుతూ ఏకంగా 26,124 చదరపు గజాల స్థలాన్ని అక్రమంగా బదలాయించి, రికార్డుల్లో డాక్యుమెంట్ నెం. 197/2026గా నమోదు చేశారు.


LRS-2020 PAYMENT RECEIPT DETAILS
GOVERNMENT OF TELANGANA
Peddashapur GRAMA PANCHAYAT

"క్రమబద్ధీకరణకు ఎలాంటి హక్కును కల్పించదు" అని రాసి ఉన్న రసీదు




**ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి..!**


ఈ రెండు ప్రధాన డాక్యుమెంట్లు (197/2026 మరియు 372/2026) ద్వారా నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి చెల్లించాల్సిన కోట్లాది రూపాయల నాలా కన్వర్షన్ ఫీజులు, స్టాంప్ డ్యూటీలను పూర్తిగా ఎగ్గొట్టారు. తద్వారా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన ఆదాయానికి అధికారులు, రియల్ మాఫియా కలిసి భారీ గండి కొట్టారు.

**ఇంటి నంబర్లు, పి టి ఐ ఎన్ నంబర్లను రద్దు చేయాలి...!**

క్షేత్రస్థాయిలో అసలు పునాదులే లేవు, కానీ కాగితాలపై 84 విల్లాలు, 3.78 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియా ఉన్నట్లు జీహెచ్ఎంసీ రికార్డుల్లో చూపిస్తూ హౌజ్ నంబర్లు (281/1/A1 నుండి 281/84/A1) బోగస్ పి టి ఐ ఎన్ నంబర్లు కేటాయించడం వెనుక మున్సిపల్ అధికారుల (బిల్ కలెక్టర్ నుండి డిప్యూటీ కమిషనర్ వరకు)హస్తం స్పష్టంగా కనిపిస్తోంది. తక్షణమే అక్రమంగా చేసిన డాక్యుమెంట్ నెం. 197/2026, 372/2026ల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని, వాటితో పాటు సృష్టించిన బోగస్ ఇంటి నంబర్లను, పి టి ఐ ఎన్ నంబర్లను జీహెచ్ఎంసీ రికార్డుల నుండి తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి..!**

ఈ భారీ స్కామ్ వెనుక శంషాబాద్ ఎస్ఆర్ఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా చక్రం తిప్పుతున్న 'నజీరుద్దీన్', ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డితో పాటు వీరికి బ్యాక్‌బోన్‌గా నిలిచిన ఒక టీఎన్‌జీఓ కీలక నేత ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌ను నిలదీయగా.. "స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ముఖ్య అనుచరులు, రియల్ వ్యాపారులు ఒత్తిడి తేవడం వల్లే ఈ రిజిస్ట్రేషన్లు చేయాల్సి వచ్చింది" అని నోరు జారడం గమనార్హం. ఈ నేపథ్యంలో, తక్షణమే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ, స్టాంపులురిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి సమగ్ర విచారణ జరపాలని, అవినీతి అధికారులపై, రియల్ మాఫియాపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని రికవరీ చేయాలని తొండుపల్లి, పెద్ద షాపూర్ గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.


भारतीय गैर न्यायिक
पचास रुपये ₹.50 FIFTY RUPEES Rs.50
INDIA NON JUDICIAL
తెలంగాణ TELANGANA
DEVELOPMENT AGREEMENT CUM IRREVOCABLE GENERAL POWER OF ATTORNEY

2) Sri RAKESH KUMAR ALIAS RAKESH GARG S/o Sri Nand Kishore, Aged about 50 Years, Occ: Business, R/o H. No.1-2-54/7, Flat No.501, Legend Mandhar Apartments, Domalguda, Hyderabad - 500029, T.G. (PAN : [redacted] & (Aadhaar [redacted]

Contd..2..

-2-

3) Sri NAND KISHORE AGARWAL S/o Late Sri Gowrishankar, Aged about 71 Years, Occ: Business, R/o H. No.21-7-200, Ghansi Bazar, Hyderabad - 500002, T.G., (PAN : [redacted] & (Aadhaar [redacted]

4) Sri ASHOK KUMAR GARG S/o Late Sri Gowrishankar, Aged about 60 Years, Occ: Business, R/o H. No.21-7-200, Ghansi Bazar, Hyderabad - 500002, T.G., (PAN : [redacted] & (Aadhaar [redacted]

"Hereinafter referred to as „LAND OWNERS/ PRINCIPALS" which term unless repugnant to the context shall mean and include all their heirs, legal representatives, GPAs, executors, administrators, successors - in - interest, assignees and nominees etc., of the FIRST PART".

IN FAVOUR OF

M/s RK MYTHRI (PAN : [redacted] a registered Partnership firm bearing Regd. No.1684 of 2022, having its Registered Office at 2-91/35 & 36/SMS/PH, Kothaguda, Hyderabad, represented by its authorized Partners

a) SMT RAPOLU KRISHNA KUMARI W/o Sri Rapolu RAJ KUMAR, Aged about 54 Years, Occ : Business, R/o H. No. 11-27/A/1, RK Nilayam, Opp BSNL Office Brindavan Township, Shamshabad, R.R. District, T.G., (Aadhaar No. [redacted]

b) Dr. PRAKASH BABU VEGUNTA S/o Sri V.V.N. Prasad, Aged about 62 Years, Occ : Doctor, R/o Flat No.1101, C Block, My Home Abhra Opposite Inorbit Mall, Gachibowli, Serilingampally, R.R. District, T.G., (Aadhaar [redacted]

"Hereinafter referred to as "DEVELOPER" which term unless repugnant to the context shall mean and include all its partners, legal representatives, heirs, executors, administrators, successors-in-office & interest, assignees and nominees etc., of the SECOND PART".

Contd..3..

# కాస్త ఆలస్యమైనా నదుల అనుసంధానం పక్కా

( మొదటి పేజీ తరువాయి )

ఉపరాష్ట్రపతి అభినందించారు. డ్రోన్లను రైతులకు అద్దెకు ఇచ్చే పథకానికి కేంద్రం రూ.1200 కోట్లను మహిళా సంఘాలకు కేటాయించిందన్నారు. పాప్ కార్న్ మొక్కజొన్నను అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడం మానేసి, మనమే ఆ దేశానికి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎనిమిది రాష్ట్రాల్లో 17,500 మంది రైతులు 40 వేల ఎకరాల్లో పాప్ కార్న్ మొక్కజొన్నను పండించడం మామూలు విషయం కాదన్నారు. ఈ ఏడాది దేవుని కృపతో అవసరమైన వర్షాలు కురుస్తాయని.. దాని గురించి ఆందోళన వద్దని చెప్పారు. మహానది నుంచి కావేరి నది వరకు నదుల అనుసంధానం కలగా మిగలదని.. కొంత ఆలస్యం కావచ్చుగానీ, వాస్తవ రూపం దాల్చుతుందని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు.

**నాలుగు రాష్ట్రాల్లో నీటి సమస్యకు పరిష్కారం : చంద్రబాబు**

నదుల అనుసంధానం ద్వారా ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సముద్రంలోకి వృథాగా పోతున్న వరద జలాలను తరలించడం ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో సాగు, తాగునీటి కొరతను పూర్తిగా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.



# సెప్టెంబర్ 7 నుండి అసెంబ్లీ సమావేశాలు

**ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, మహా :** శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రజాప్రతినిధులకు వివరించారు. బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి గారు అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ప్రజాప్రతినిధులందరూ నియోజకవర్గాల అభివృద్ధిపై ఫోకస్ పెంచాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తి కావని, భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ అనుమతులకు సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి , తుమ్మల నాగేశ్వర్ రావు , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ధనసరి అనసూయ సీతక్క , ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్ , రామచంద్ర నాయక్ , బీర్ల ఐలయ్య , వేముల వీరేశం పాల్గొన్నారు. ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ , వేం నరేందర్ రెడ్డి , కడియం కావ్య , రఘువీర్ రెడ్డి , ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు. అలాగే ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం , వీర్లపల్లి శంకర్ , ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్ , మట్టా రాగమాయి , మందుల సామేల్ , వేడ్మ బొజ్జు , కోరం కనకయ్య , లక్ష్మీకాంత రావు , రాందాస్ నాయక్ , కడియం శ్రీహరి , డాక్టర్ సంజయ్ , బత్తుల లక్ష్మారెడ్డి , మనోహర్ రెడ్డి , తెల్లం వెంకట్ రావు , నాగరాజు , రేవూరి ప్రకాష్ రెడ్డి , మురళి నాయక్ , యశస్విని రెడ్డి పాల్గొన్నారు.

### ఏపీకి రూ.32 వేల కోట్ల

# గ్రీన్‌ఫీల్డ్ కారిడార్!

**విజయవాడ, మహా.** ఆంధ్రప్రదేశ్ మౌలిక వసతుల రంగంలో మరో భారీ ప్రాజెక్టుకు మార్గం సుగమమైంది. తూర్పు భారతదేశాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతితో అనుసంధానించే ఖరగ్‌పూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం తెలపడంతో రాష్ట్ర రవాణా, ఆర్థిక రంగాల్లో కొత్త అవకాశాలకు తలుపులు తెరుచుకున్నాయి. మొత్తం 1,107 కిలోమీటర్ల పొడవైన ఈ నాలుగు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో 457 కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్ పరిధిలో నిర్మించనున్నారు. రాష్ట్రంలో ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం దాదాపు రూ.32 వేల కోట్లుగా ఉంది.

పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా మీదుగా సాగే ఈ భారీ కారిడార్ ఆంధ్రప్రదేశ్‌లో అరకు, పాడేరు, చింతపల్లి, జంగారెడ్డిగూడెం ప్రాంతాల మీదుగా అమరావతిని చేరనుంది. తూర్పు భారతదేశం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వస్తువుల రవాణాకు ఇది ప్రత్యామ్నాయ, వేగవంతమైన మార్గంగా మారే అవకాశం ఉంది. ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం లభించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర రహదారులు-రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు.

**తూర్పు భారత్ నుంచి అమరావతికి 'ఆర్థిక దారి'**

ఇప్పటి వరకు తూర్పు భారతదేశం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు సరకు రవాణా చేసే మార్గాల్లో ఉన్న దూరం, సమయం, వ్యయ పరిమితులకు ఈ కారిడార్ కొంత మేర పరిష్కారం చూపే అవకాశం ఉంది. ఖరగ్‌పూర్ వంటి తూర్పు ప్రాంతాల నుంచి ఒడిశా, ఉత్తరాంధ్ర, ఏపీ మధ్యభాగం మీదుగా అమరావతికి నేరుగా అనుసంధానం ఏర్పడటం వల్ల సరకు రవాణా వ్యవస్థకు కొత్త ఊపు వచ్చే అవకాశం ఉంది.

ప్రత్యేకించి అరకు, పాడేరు, చింతపల్లి వంటి ఏజెన్సీ ప్రాంతాలకు మెరుగైన రహదారి అనుసంధానం కల్పించడం ద్వారా అక్కడి వ్యవసాయ, ఉద్యాన, అటవీ ఆధారిత ఉత్పత్తులకు విస్తృత మార్కెట్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఉత్పత్తి కేంద్రాల నుంచి మార్కెట్లకు సరుకులు వేగంగా చేరితే రవాణా వ్యయం తగ్గడంతో పాటు రైతులు, వ్యాపారులకు ప్రయోజనం కలగవచ్చు.

**పరిశ్రమలకు కొత్త సరఫరా గొలుసు**

గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ ప్రభావం కేవలం ప్రయాణ సౌకర్యానికే పరిమితం కాదనే అంచనాలు ఉన్నాయి. రహదారి వెంట ఉన్న ప్రాంతాల్లో గిడ్డంగులు, లాజిస్టిక్స్ కేంద్రాలు, కోల్డ్ చైన్లు, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, చిన్న-మధ్య తరహా పరిశ్రమలు ఏర్పడేందుకు అవకాశాలు పెరగవచ్చు. తూర్పు భారతదేశంలోని పారిశ్రామిక ప్రాంతాల నుంచి ముడిసరుకు, యంత్రాలు, ఇతర ఉత్పత్తులు ఏపీకి చేరడం, రాష్ట్రం నుంచి తయారైన ఉత్పత్తులు ఇతర రాష్ట్రాలకు వెళ్లడం సులభతరం కావచ్చు.అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగానే కాకుండా ప్రాంతీయ ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ కారిడార్ వ్యూహాత్మకంగా ఉపయోగపడే అవకాశం ఉంది. రాజధానికి ఉత్తర, తూర్పు భారతదేశంతో నేరుగా మెరుగైన రహదారి అనుసంధానం ఏర్పడితే పెట్టుబడిదారులకు కూడా కొత్త రవాణా మార్గం అందుబాటులోకి వస్తుంది.

**వెనుకబడిన ప్రాంతాలకు మౌలిక వసతుల ఊతం**

అరకు, పాడేరు, చింతపల్లి వంటి ప్రాంతాల మీదుగా భారీ రహదారి ప్రాజెక్టు నిర్మాణం జరగడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. రహదారి మౌలిక వసతులు మెరుగుపడటంతో పర్యాటకం, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, చిన్న పరిశ్రమలు, సేవా రంగాలకు అవకాశాలు పెరగవచ్చు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడితే మార్కెట్ చేరువ అవుతుంది.

అయితే భారీ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు కావడంతో భూసేకరణ, పర్యావరణ అనుమతులు, అటవీ ప్రాంతాలపై ప్రభావం, గిరిజన ప్రాంతాల్లో స్థానిక ప్రజల ప్రయోజనాల పరిరక్షణ వంటి అంశాలు కూడా కీలకంగా మారనున్నాయి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్థానికుల హక్కుల మధ్య సమతుల్యత సాధిస్తూ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.




### అమరావతికి మరో భారీ అనుసంధానం

అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం భారీ మౌలిక వసతుల ప్రణాళికను ముందుకు తీసుకెళ్తున్న సమయంలో ఖరగ్‌పూర్-అమరావతి కారిడార్‌కు ఆమోదం లభించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ, పారిశ్రామిక కారిడార్లు, పోర్టు అనుసంధాన ప్రాజెక్టులపై దృష్టి పెడుతున్న నేపథ్యంలో ఈ కొత్త రహదారి నెట్‌వర్క్ వాటికి అనుసంధానంగా పనిచేసే అవకాశం ఉంది. ఒక రహదారి నిర్మాణం అంటే కేవలం రెండు ప్రాంతాలను కలపడం కాదు. దాని వెంట మార్కెట్లు, పరిశ్రమలు, లాజిస్టిక్స్ కేంద్రాలు, ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు కూడా కదులుతాయి. ఆ కోణంలో చూస్తే రూ.32 వేల కోట్ల అంచనా వ్యయంతో ఏపీ పరిధిలో నిర్మించనున్న 457 కిలోమీటర్ల ఖరగ్‌పూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ రాష్ట్ర భవిష్యత్తు ఆర్థిక అనుసంధానంలో కీలకమైన మౌలిక వసతిగా నిలిచే అవకాశం ఉంది. తూర్పు భారతదేశం నుంచి అమరావతి వరకు ఏర్పడే ఈ కొత్త 'ఆర్థిక మార్గం' పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోని వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం, లాజిస్టిక్స్ రంగాలకు దీర్ఘకాలికంగా గణనీయమైన ఊతం లభించే అవకాశముంది.






# ఎస్ఐఆర్ ఫేజ్ 2 లో మరింత అప్రమత్తంగా ఉండాలి

( మొదటి పేజీ తరువాయి )



.పర్మినెంట్ షిఫ్టింగ్ 18వేలు,మృతి చెందిన వారు 5వేల 838,గైర్హాజరు 10వేల 966,ఎన్ రోల్ మెంట్ పూర్తయినవి 4వేలు, మొత్తం 2లక్షల 50వేల 393 ఓట్లలో 39వేల 664 ఓట్లు తొలగించే ప్రమాదం ఉందన్నారు.ఎస్ఐఆర్ ఫేజ్ 2 లో బీఎల్ఏ2లు ఎస్ఐఆర్ కోఆర్డినేషన్ కమిటీ ఒక్క అర్హడి ఓటు కూడా పోవద్దు. మ్యాపింగ్ కానివారికి నోటీసులొస్తే ఎన్నికల కమీషన్ సూచించన 12 ధృవీకరణ పత్రాలలోఏదో ఒకటి సమర్పించి ఓటు పోకుండా కాపాడేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.మ్యాపింగ్ కాని ఓట్లను రక్షించుకోవాలని సూచించారు. పేదల ఓట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత మనమీదే ఉందన్నారు. ఫేజ్ వన్ లో ఎలా చురుకుగా పనిచేసామో ఫేజ్ టూలో కూడా అంతే చురుకుగా పని చేయాలని సూచించారు.నోటీసులొచ్చినవారి వివరాలు సేకరించి వారి ఓటు పోకుండా జాగ్రత్త పడాలని అన్నారు. అవసరమైతే కోర్టు ద్వారా పోరాడి అయినా సరే ఓటును కాపాడుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ గడ్డమీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని రాష్ట్ర హైకమాండ్ మనమీద ఒక బాధ్యత పెట్టిందని అన్నారు. దాన్ని మనమంతా సవాల్ గా తీసుకుని గెలిచేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ సీటుతో పాటు పార్లమెంట్ పరిధి లోని ఏడుకు ఏడు అసెంబ్లీ స్థానాలలో గెలుస్తామని విశ్వాసం వ్యక్తం చేసారు. ఆదిలాబాద్ అసెంబ్లీ సీటు గెలిచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కానుకగా సమర్పిద్ధామన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్ని మాయ మాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టినా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని మాత్రం అడ్డుకోలేరన్నారు. ఏ పాయల్ శంకర్ కోవర్టు మనల్ని ఏమీ చేయలేరన్నారు. పార్టీ కోసం ఆదిలాబాద్ ప్రజల కోసం తాను పోరాడుతూనే ఉంటానన్నారు.మీ శక్తితోనే తాను ముందుకు నడుస్తున్నట్టు తెలిపారు. కొత్త పాత కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా తాను కాపాడుకుంటానని అన్నారు.విజయం కోసం అంతా కలిసి కట్టుగా పని చేద్దామన్నారు. రాష్ట్రంలో మరోమారు పార్టీ అధికారంలోకి రావాలని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. అలాగే దేశంలో పార్టీ అధికారం చేపట్టి ప్రధాని గా రాహుల్ గాంధీ అవుతారని ఆశాభావం వ్యక్తం చేసారు.ఇండ్లు లేని పేద కార్యకర్తలకు ఇండ్లువచ్చేలా కృషి చేస్తానన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమన్నారు.ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూకబ్జాలకు చరమగీతం పాడుదామన్నారు. ప్రభుత్వ అసైన్డ్ భూమిని పాయల్ శంకర్ తన భార్యకు బహుమతిగా ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే అక్రమాలపై ప్రశ్నించాలన్నారు. భూసేకరణలో కూడా అక్రమాలకు పాల్పిడితే కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఎక్కడికక్కడ అడ్డుకుంటారన్నారు. బీజేపీ కార్యకర్తలే ఎమ్మెల్యే అవినీతి చిట్టాను తమకందిస్తున్నారని అన్నారు. ఎన్ని కష్టనష్టాలకోర్చయినా తాను ప్రజల తరపున కార్యకర్తల తరపున ఉంటానన్నారు. ఎమ్మెల్యే తాటాకు చప్పుళ్ళకు తాను భయపడనని అక్రమాలపై నిరంతరం పోరాడుతూనే ఉంటానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను శ్రేణులు ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ లో పార్టీ శ్రేణులు పాల్గొనాలన్నారు. సోషల్ మీడియాలో కూడా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. బూత్ స్థాయి నుండి పార్టీ బలోపేతం చేసుకుని ఆదిలాబాద్ లో కాంగ్రెస్ పార్టీని ఒక అజేయ శక్తి గా నిలుపుదామన్నారు.గెలుపుకోసం తన శక్తినంతా ధారపోస్తానన్నారు.అంతా కలిసికట్టుగా పార్టీ కోసం కష్టపడదామని పిలుపునిచ్చారు. నాయకులు కార్యకర్తలను కలవడం చాలా సంతోషంగా ఉందని కంది మౌనా శ్రీనివాస రెడ్డి అన్నారు.. మీ అందరి సహకారం ఇలాగే ఉండాలని కోరుతున్నానని మనవి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు బండారి సతీష్, ఇజ్జగిరి సంజయ్, ఖిజర్ పాషా, సుధాకర్ రెడ్డి లోక ప్రవీణ్ రెడ్డి, కొండ గంగాధర్ , మునిగెల నర్సింగ్ , మునిగెల విటల్, గుడిపల్లి నగేష్,శాంతన్ రావు,భోజారెడ్డి దాసరి ఆశన్న, షాహిద్ ఆలీ, మహబూబ్ , చరణ్ గౌడ్, రాందాస్ నాక్లే , బిక్కి గంగాధర్, అశోక్ ఠాక్రె, సుదర్శన్ అల్చెట్టి నాగన్న, కోలా నర్సింలు,సుఖేందర్ , అన్నపూర్ణ ,స్వాతి కాంబ్లే, మంచికట్ల ఆశమ్మ, శ్రీలేఖ,కావేటి జ్యోతి,సోనియా జుబేదా, రఫీఖ్, ఎంఏ షకీల్ ,వెంకట్ యాదవ్, బత్తుల శ్రీనివాస్, బాపూరావు,ఆత్రం నగేష్, కమలాబాయి, నితిన్ బోయర్,వేణుగోపాల రెడ్డి,వామన్,నిమ్మల గౌతం రెడ్డి ,ఆతిఖ్ , శ్యామ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ పాక్ వెళ్లొచ్చు.. మేం అమెరికా వెళ్లకూడదా?

( మొదటి పేజీ తరువాయి )



అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు. లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, భాజపా నేతల తీరును ప్రశ్నించారు. "రాష్ట్రాలకు కేంద్రం సహకరించకపోవడం మన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. విద్యలో సహకారం, పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికా పర్యటన తలపెట్టాను. బ్రిటన్‌కు అనుమతించి.. అమెరికా పర్యటనను కేంద్రం నిరాకరించింది. పెట్టుబడులు సాధన కోసం గతంలోనూ విదేశాలకు వెళ్లాం. కానీ ఈసారి లండన్‌కు అనుమతించి అమెరికా వెళ్లకుండా చేశారు. కేంద్రం వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ శ్రేణులతో పాటు విద్య, క్రీడల విధానాలు, పెట్టుబడుల విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా యువతకు మేలు జరుగుతుందని నమ్మే వారంతా తప్పుబట్టారు. విదేశాంగ శాఖ నా పర్యటనను తిరస్కరించడంతో పాటు భాజపా నేతలు కొందరు నా పర్యటన వివరాలపై తప్పుదారి పట్టించేలా, వ్యక్తిగత ఆరోపణలు చేశారు. నా అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పి తప్పుదోవ పట్టించారు.

**బ్రిటన్ కు ఓకే చెప్పి.. అమెరికాకు అడ్డుకోవడమేంటి?**

నా విదేశీ పర్యటనలో ఎలాంటి గోప్యత లేదు. ఈ పర్యటనకు దరఖాస్తు చేసినప్పుడు అన్ని విషయాలూ స్పష్టంగా పేర్కొన్నాం. విద్య, క్రీడలు, రాష్ట్రంలో పెట్టుబడులకు అమెరికాలో ప్రఖ్యాత వర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని చెప్పాం. యూకే, యూఎస్ పర్యటనకు ఒకే తరహా వివరాలు ఇచ్చాం. నా పర్యటన మొత్తం షెడ్యూల్‌ను విదేశాంగ శాఖ ముందు ఉంచాం. కానీ, రాజకీయ కారణాల వల్ల అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరిస్తున్నట్లు విదేశాంగ శాఖ బదులిచ్చింది. రాజకీయ కారణంతో అనుమతి ఇవ్వడంలేదని విదేశాంగ శాఖ బదులిచ్చింది. రాజకీయ కారణం అంటే ఏమిటీ? బ్రిటన్ పర్యటనకు ఓకే చెప్పి.. అమెరికా పర్యటనను మాత్రం ఎందుకు అడ్డుకున్నారు. నేను తెలంగాణ సీఎంను.. కాంగ్రెస్ సీఎంను కావడమే కారణమా? ఒక సీఎం విదేశాలకు వెళ్తే విదేశీ రాయబారులు వెంటే ఉంటారు. ప్రతి కార్యక్రమాన్నీ వారు పర్యవేక్షిస్తారు.

**నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు**

కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా.

**మోదీ పాక్ వెళ్లొచ్చు.. మేం అమెరికా వెళ్లకూడదా?**

నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉంది.

**తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని సహించం**

తెలంగాణ సీఎంకు అనుమతి నిరాకరించడం అంటే ఒక వ్యక్తిగా రేవంత్ రెడ్డికి ఎదురైన నిరాకరణ కాదు.. 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం.. తిరస్కరణ. ఈ తిరస్కరణకు కారణం గుజరాత్ ఆధిపత్యం. రాజకీయ కారణాలు చూపించి అనుమతి నిరాకరించడాన్ని తెలంగాణ సమాజం ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరముంది. తెలంగాణ సీఎంను అమెరికా వెళ్లకుండా అడ్డుకోవడమంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. రాష్ట్రం పట్ల కేంద్రం స్పష్టమైన వివక్షను చూపిస్తోంది. ఇది ఏమాత్రం సహించరానిది. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి'' అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్ ప్రజల హక్కు.. ఆక్రమిస్తే ఊరుకోం!

**ఢిల్లీ , మహా. :** నగరాలు, పట్టణాల అభివృద్ధి అంటే కేవలం వాహనాల రాకపోకలకు రహదారులు విస్తరించడం కాదని.. పాదచారుల భద్రత, హక్కులను కూడా సమానంగా పరిరక్షించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రోడ్డు ఉన్న ప్రతి ప్రాంతంలో పాదచారులు సురక్షితంగా నడిచేందుకు స్పష్టంగా గుర్తించిన, ఆక్రమణలకు తావులేని ప్రత్యేక స్థలం ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన ధర్మాసనం.. ఇప్పుడు ఈ ఆదేశాల అమలు విషయంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేసులో భాగస్వాములుగా చేర్చింది. పాదచారుల హక్కును పట్టణ మౌలిక వసతుల్లో అంతర్భాగంగా పరిగణించిన న్యాయస్థానం, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతను కూడా స్పష్టం చేసింది.

జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం పాదచారుల కోసం ఏర్పాటు చేసే మార్గాలను వాహనాలు తిరిగే రహదారుల నుంచి స్పష్టంగా వేరు చేయాలని సూచించింది. గతంలో ఇచ్చిన ఆదేశాల అమలుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అవసరమైన మార్గదర్శకాలు, సూచనలు అందించాలని కోర్టు పేర్కొంది. తాజాగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఈ వ్యవహారంలో చేర్చడంతో ఇక ఆయా ప్రభుత్వాలు తమ పరిధిలో పాదచారుల మార్గాల పరిస్థితి, ఆదేశాల అమలుపై సమాధానం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**రోడ్డుపై నడిచే దుస్థితికి ముగింపు ఎప్పుడు?**

దేశంలోని అనేక నగరాల్లో పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఎక్కడో దుకాణాల విస్తరణకు ఉపయోగిస్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్ స్థలాలుగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల నిర్మాణ సామగ్రి, వ్యాపార వస్తువులు, ప్రకటనల సామగ్రితో పాదచారుల మార్గాలు పూర్తిగా మూసుకుపోతున్నాయి. ఫలితంగా పాదచారులు తప్పనిసరిగా ప్రధాన రహదారిపైకి వచ్చి నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వాహనాల వేగం పెరుగుతున్న రహదారులపై పాదచారులు వాహనాలతో పోటీపడి నడవాల్సి రావడం ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా మారుతోంది. చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు రహదారులపై నడిచేటప్పుడు మరింత ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఫుట్‌పాత్ అనేది నగర అలంకరణ కోసం నిర్మించే అదనపు సౌకర్యం కాదని.. ప్రజల సురక్షిత రాకపోకలకు అవసరమైన మౌలిక హక్కుగా చూడాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు ఆదేశాలు మరోసారి ముందుకు తెచ్చాయి.

**'వాహనాలకు దారి.. పాదచారులకు కూడా దారి'**

పట్టణ రహదారుల రూపకల్పనలో వాహనాల అవసరాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని పాదచారుల అవసరాలను పక్కన పెట్టడం సరికాదన్న సందేశాన్ని సుప్రీంకోర్టు ఇచ్చింది. రహదారి నిర్మించిన ప్రతి చోట పాదచారులకు సురక్షితమైన మార్గం ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

పాదచారుల కోసం కేటాయించిన స్థలం కేవలం కాగితాలపై ఉండటం కాకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని.. అది వాహనాల మార్గంతో కలిసిపోకుండా స్పష్టమైన విభజన ఉండాలని ధర్మాసనం సూచించింది. ఈ మార్గాలను ఆక్రమణల నుంచి కాపాడటం స్థానిక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థలు, పోలీసు యంత్రాంగం, సంబంధిత ప్రభుత్వ విభాగాల బాధ్యతగా మారనుంది.

**ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాల్సిందే**

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు ఎన్నో నగరాల్లో నిత్య సమస్యగా మారాయి. ఆక్రమణ తొలగింపు చర్యలు చేపట్టినప్పుడు కొంతకాలం పరిస్థితి మెరుగుపడినా.. మళ్లీ అదే స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో పాదచారుల కోసం నిర్మించిన మౌలిక వసతులు ఉద్దేశం కోల్పోతున్నాయి.

సుప్రీంకోర్టు జోక్యంతో ఇక ఫుట్‌పాత్‌లను ఎవరు ఎలా ఉపయోగిస్తున్నారు అన్న అంశంపై ప్రభుత్వాలు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఏర్పడింది. ప్రజల రాకపోకలకు కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగిస్తే పాదచారుల భద్రత దెబ్బతింటుందని న్యాయస్థానం స్పష్టం చేసినట్లయింది.

**నగరాభివృద్ధికి కొత్త నిర్వచనం**

ఇప్పటివరకు నగరాభివృద్ధిని ప్రధానంగా రహదారుల విస్తరణ, వాహనాల వేగం, వంతెనలు, రహదారి అనుసంధానాల కోణంలోనే చూస్తున్నారు. కానీ నగరంలో నడిచే సామాన్యుడికి సురక్షితమైన స్థలం కల్పించకపోతే ఆ అభివృద్ధి అసంపూర్ణమే. సుప్రీంకోర్టు తాజా జోక్యం ఈ దృష్టికోణాన్ని మార్చే అవకాశం ఉంది.

ప్రతి నగరంలో పాదచారుల మార్గాలపై సమగ్ర సర్వే నిర్వహించడం, ఆక్రమణలను తొలగించడం, అవసరమైన చోట కొత్త ఫుట్‌పాత్‌లు నిర్మించడం, దివ్యాంగులు సులభంగా ఉపయోగించుకునేలా మార్గాలను తీర్చిదిద్దడం, వాహనాల పార్కింగ్‌ను నియంత్రించడం వంటి చర్యలు ఇక ప్రభుత్వాల ముందున్న ప్రధాన బాధ్యతలుగా మారనున్నాయి.రోడ్డు వాహనాల కోసం మాత్రమే కాదు.. అదే రహదారిపై సురక్షితంగా నడిచే హక్కు కూడా ప్రజలదే. నగరాలను వేగవంతమైన వాహనాల కోసం మాత్రమే కాకుండా సురక్షితంగా నడిచే మనుషుల కోసం కూడా నిర్మించాలన్న బలమైన సందేశాన్ని సుప్రీంకోర్టు జోక్యం ఇచ్చింది. దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఈ వ్యవహారంలోకి తీసుకురావడంతో ఇక ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, పాదచారుల భద్రతపై ప్రభుత్వాలు చెప్పే మాటలకంటే.. క్షేత్రస్థాయిలో అమలు ఎలా ఉందన్నదే కీలకం కానుంది.

# కేబుల్ ఛానళ్ళ సమస్యలు పరిష్కరించండి

హైదరాబాద్, మహా :
రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ళు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నాయకత్వంలో పలువురు కేబుల్ ఛానళ్ళ నిర్వాహకులు, ఫెడరేషన్ నాయకులు సోమవారం తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డిని కలిసి కేబుల్ ఛానళ్ళ అక్రెడిటేషన్ కార్డుల సమస్య పై చర్చించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ళుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో కేబుల్ నెట్వర్క్ ద్వారా నడుస్తున్న కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, దీనివల్ల ఆయా ఛానళ్ళలో పని చేస్తున్న జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డులు లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఎంతోమంది సీనియర్ జర్నలిస్టులు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి కొన్నేళ్ళుగా నడుపుతున్న కేబుల్ న్యూస్ ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డుల విషయంలో అన్యాయం చేయడం తగదని, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం లేకపోయినప్పటికీ జర్నలిజం పట్ల వారికున్న మక్కువతో కష్ట నష్టాలకోడ్చి నడుపుతున్న కేబుల్ ఛానళ్ళకు ప్రభుత్వం ఇచ్చే ఏకైక అక్రెడిటేషన్లు కూడా సరిగా ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో చాలా కేబుల్ నెట్వర్క్ సంస్థలు కొత్త టెక్నాలజీతో ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) నెట్వర్క్ ద్వారా న్యూస్ ఛానళ్ళను నడుస్తున్నాయని, సీనియారిటీ ఉన్న ప్రతి కేబుల్ ఛానల్ తో పాటు అన్ని అర్హతలున్న కొత్త ఛానళ్ళకు, ఐపీ ఆధారిత న్యూస్ ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని మామిడి సోమయ్య కోరారు. కేబుల్ ఛానళ్ళ సంఖ్య, జర్నలిస్టుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కేబుల్ చానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు తగ్గించకుండా,కనీసం గతంలో ఇచ్చిన మాదిరిగా, జిల్లాకు 4, రాష్ట్ర స్థాయిలో 12 కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి అన్నారు. ఇప్పటికే అన్ని అర్హతలతో అక్రెడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న కేబుల్ ఛానళ్ళకు వెంటనే కార్డులు ఇవ్వాలని, ఐపీ నెట్వర్క్ లో నడుస్తున్న న్యూస్ ఛానళ్ళను కూడా గుర్తించి అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అనంతరం వారు ఛైర్మన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కోకన్వీనర్ ఎస్. రవికుమార్, జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు గిరిబాబు, వెంకట్, కుమారస్వామి, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 22ఏపై ప్రతిపక్షాల 'అబద్ధాల ప్రచారం'

( మొదటి పేజీ తరువాయి )

వాటిని పరిశీలించి రిజిస్ట్రేషన్లకు అనుమతులు ఇస్తున్నామని చెప్పారు. నిబంధనల పరిధిలోకి రాని భూములకు మాత్రం ఎలాంటి ఒత్తిళ్లకూ తలొగ్గబోమని తేల్చిచెప్పారు. 22ఏ భూముల సమస్యల కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ పనిచేయడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని పొంగులేటి అన్నారు. ఇప్పటి వరకు టోల్‌ఫ్రీ నంబర్‌కు 1,162 కాల్స్ వచ్చాయని, పునరావృత కాల్స్‌ను తొలగిస్తే 980 కాల్స్ నమోదయ్యాయని వివరించారు. వీటిలో 547 వ్యవసాయానికి సంబంధించినవి కాగా, 433 వ్యవసాయేతర అంశాలకు సంబంధించినవని తెలిపారు. రిజిస్ట్రేషన్ జరగలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. అర్హత, రికార్డులు, చట్టపరమైన పరిస్థితులను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

**'దొంగ జీవోలతో రిజిస్ట్రేషన్లు చేయించలేరు'**

కొంతమంది నకిలీ జీవోలు, మెమోలు తీసుకొచ్చి అధికారులపై ఒత్తిడి తెచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పొంగులేటి ఆరోపించారు. ఇలాంటి చర్యలను ప్రభుత్వం ఉపేక్షించబోదని, దొంగ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి తప్పుడు జీవోలు, మెమోల ఆధారంగా భూముల రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం సాధ్యం కాదని కుండబద్దలు కొట్టారు. సీఎస్7, సీఎస్14కు సంబంధించిన భూములపై దశాబ్దాలుగా వివాదాలు కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. సామాన్య ప్రజలను తెర ముందుకు తీసుకొచ్చి, వారి వెనుక నుంచి కొందరు తమ స్వప్రయోజనాల కోసం కార్యక్రమాలు నడిపిస్తున్నారని విమర్శించారు.

**811 ఎకరాలపై విచారణకు సిద్ధమా?**

వివాదాస్పద భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మంత్రి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఖరీదైన కార్లు తీసుకుని సీఎస్7, సీఎస్14 పరిధిలోని భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారంటూ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని లేవనెత్తడంతోనే వివాదం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఆ భూములకు సంబంధించి సుమారు 811 ఎకరాల వ్యవహారంపై ప్రతిపక్షాలు విచారణకు సిద్ధంగా ఉన్నాయా? అని పొంగులేటి సూటిగా ప్రశ్నించారు. భూముల రికార్డులు, గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, వాటి వెనుక ఉన్న లావాదేవీలను సమగ్రంగా పరిశీలిస్తే అసలు వాస్తవాలు బయటకు వస్తాయని అన్నారు.

**సర్వేనెంబర్ 403పై మంత్రి వివరణ**


సర్వే నంబర్ 403 విషయంలోనూ మంత్రి వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం ఆ సర్వే పరిధిలోనే ఉందని తెలిపారు. మొత్తం 1,288 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఆ సర్వే నంబర్‌లో కేవలం రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయని చెప్పారు.అధికారుల పొరపాటు కారణంగా మొత్తం సర్వే నంబర్ 403ను నిషేధిత జాబితాలో చేర్చిన పరిస్థితి ఏర్పడిందని, అనంతరం ఆ తప్పిదాన్ని సరిచేశామని పొంగులేటి వివరించారు. ఒకటి రెండు భూములపై ఉన్న అభ్యంతరాలను ఆధారంగా చేసుకుని మొత్తం సర్వే నంబర్‌నే నిషేధిత జాబితాలో పెట్టడం సరికాదన్నారు.

# సెప్టెంబర్ 7 నుండి అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్, మహా :** శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రజాప్రతినిధులకు వివరించారు. బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి గారు అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ప్రజాప్రతినిధులందరూ నియోజకవర్గాల అభివృద్ధిపై ఫోకస్ పెంచాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తి కావని, భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ అనుమతులకు సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి , తుమ్మల నాగేశ్వర్ రావు , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ధనసరి అనసూయ సీతక్క , ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్ , రామచంద్ర నాయక్ , బీర్ల ఐలయ్య , వేముల వీరేశం పాల్గొన్నారు. ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ , వేం నరేందర్ రెడ్డి , కడియం కావ్య , రఘువీర్ రెడ్డి , ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు. అలాగే ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం ,వీర్లపల్లి శంకర్ , ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్ ,మట్టా రాగమాయి , మందుల సామేల్ , వేడ్మ బొజ్జు , కోరం కనకయ్య , లక్ష్మీకాంతరావు , రాందాస్ నాయక్ , కడియం శ్రీహరి , డాక్టర్ సంజయ్ , బత్తుల లక్ష్మారెడ్డి , మనోహర్ రెడ్డి , తెల్లం వెంకట్ రావు , నాగరాజు , రేవూరి ప్రకాష్ రెడ్డి , మురళి నాయక్ , యశస్విని రెడ్డి పాల్గొన్నారు.

# నీటి పంపిణీపై నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడ్డ కేఆర్ఎంబీ సమావేశం

- జలసౌధలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ
- కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ అధ్యక్షతన సమావేశం
- శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు, రెండు రాష్ట్రాల అవసరాలపై చర్చ




**హైదరాబాద్, మహా** : హైదరాబాద్ జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. భేటీకి తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు, ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి హాజరయ్యారు. నాగార్జున సాగర్, శ్రీశైలం జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి పంపిణీపై ఈ భేటీలో చర్చలు జరిపారు. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకుగానూ నీటి విడుదలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీని సమావేశ పర్చారు. తొలుత ఈ నెల 13న సమావేశం అయ్యేందుకు తేదీని ఖరారు చేశారు. తర్వాత 17కు వాయిదా పడింది. ఆ సమయంలో ఏపీ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మరోసారి వాయిదా పడింది. దీంతో నేడు ఈ భేటీని నిర్వహించారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు, రెండు రాష్ట్రాల అవసరాలపై చర్చించారు. తాగునీటి కోసం చెరి సగం వాడుకోవాలని తెలంగాణ సమావేశంలో ప్రస్తావించింది. అయితే ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా సెప్టెంబర్ 4కు మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు.

**50:50 నిష్పత్తిలో వాడుకోవాలి**

సాగర్, శ్రీశైలం నీటి వాటాలపై చర్చించామని తెలంగాణ ఈఎన్సీ రఘువర్ధన్ తెలిపారు. ఎల్‌నినో దృష్ట్యా తాగునీటికే వాడుకోవాలని త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుందని అన్నారు. తాగునీటికి 50:50 నిష్పత్తిలో వాడుకోవాలని చెప్పామని, పోతిరెడ్డిపాడు నుంచి ఎక్కువ నీరు వాడుకుంటున్నారని ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులలో నీటి వాటాలపై చర్చ జరిగింది. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా తాగునీటి కోసం మాత్రమే నీటిని వాడుకోవాలని త్రిసభ్య కమిటీలో నిర్ణయించారు. తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో వాడుకోవాలని చెప్పాం. ఏపీ పోతిరెడ్డిపాటు నుంచి ఎక్కువ నీరు వాడుకొందని ఫిర్యాదు చేశాం. సెప్టెంబర్ 4వ తేదీన తాగునీటి అవసరాలపై మాత్రమే చర్చ ఉంటుంది. భవిష్యత్‌లో ప్రవాహాలు వస్తే తదుపరి ఆలోచిస్తామని తెలంగాణ ఈఎన్‌సీ రమేశ్ బాబు చెప్పారు.

**సెప్టెంబర్ నాలుగో తేదీన చర్చిస్తాం**

ఎల్ నినో పరిస్థితుల్లో తాగునీటి కోసమే ఉపయోగించుకోవాలని సూత్రప్రాయ నిర్ణయం జరిగిందని ఏపీ ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహ మూర్తి తెలిపారు. రెండు రాష్ట్రాల వాటా అంశం చర్చకు రాలేదని, సెప్టెంబర్ నాలుగో తేదీన మళ్లీ సమావేశమై చర్చిస్తామని పేర్కొన్నారు.

# ఇరాన్ ఇంధన రంగంలో కీలకమలుపు

ప్రపంచ భౌగోళికరాజకీయ రంగంలో పశ్చిమాసియా ఎప్పుడూ అత్యంత కీలకమైన ప్రాంతంగా ఉంటుంది. ఇందులోనూ ఇంధన వనరుల పరంగా ఇరాన్ స్థానం ప్రత్యేకమైనది. తాజాగా ఇరాన్ దక్షిణ ప్రాంతంలోని ఫార్స్ ప్రావిన్స్‌లో 7.5 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల భారీ సహజ వాయు నిక్షేపాలు వెలుగులోకి రావడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఒకవైపు అమెరికా, ఇజ్రాయెల్‌తో తీవ్ర ఉద్రిక్తతలు, మరోవైపు దెబ్బతిన్న ఇంధన మౌలిక సదుపాయాలతో సతమతమవుతున్న ఇరాన్‌కు ఈ కొత్త నిల్వలు ఒక పెద్ద ఊరటగా మారాయి. భూగర్భ ఇంధన వనరుల్లో సుసంపన్న దేశం.. ఇరాన్. ఇక్కడ మరోసారి భారీ సహజ వాయు నిక్షేపాలు వెలుగులోకి వచ్చాయి. ఇరాన్ దక్షిణ ప్రాంతంలోని ఫార్స్ ప్రావిన్స్‌లో విస్తారమైన సహజ వాయువు నిల్వలు ఉన్నట్లు మంత్రి మొహసిన్ పాక్‌నెజాద్ వెల్లడించారు. అమెరికాతో యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఇవి వెలుగులోకి రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నేచురల్ గ్యాస్ రికవరీ రేటు దాదాపు 5.7 ట్రిలియన్ క్యూబిక్ అడుగులు. అంతే.. ఇంత పరిమాణంలో సహజ వాయువును వెలికితీయవచ్చు. ఇది అత్యంత నాణ్యమైన స్వీట్ గ్యాస్ రకానికి చెందినది కావడం విశేషం. రసాయన పరంగా ఇందులో సల్ఫర్ పరిమాణం చాలా తక్కువగా ఉండటం వల్ల శుద్ధి ప్రక్రియ అత్యంత సులభంగా మారుతుందని, దీనికి ఉన్న సహజ స్వభావం వల్ల రోజువారీ నిర్వహణ ఖర్చులు సైతం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని ఇరాన్ అంచనా వేసింది. ఈ ఎనర్జీ ఫీల్డ్‌లో సహజ వాయువుతో పాటు విలువైన గ్యాస్ కండెన్సేట్ నిల్వలు కూడా పుష్కలంగా ఉన్నట్లు ఇరాన్ మంత్రిత్వ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. దీనికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలు గానీ, ఇతరత్రా వివరాలను గానీ అధికారులు ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇజ్రాయెల్, అమెరికాతో నెలకొన్న తీవ్ర భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా ఇరాన్ ఎనర్జీ వనరుల వ్యవస్థ ప్రస్తుతం విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. కీలకమైన పవర్ గ్రిడ్స్, క్రూడాయిల్, నేచురల్ గ్యాస్ ప్రాసెసింగ్ ప్లాంట్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం మౌలిక సదుపాయాలను పునరుద్ధరించుకోవడానికి శ్రమిస్తోంది. ఇలాంటి సంక్షోభ సమయంలో నూతన నిక్షేపాలు లభించడం ఆ దేశానికి ఊరట లభించినట్టయింది. ఈ సైనిక దాడుల వల్ల ఇరాన్ ఇంధన ఉత్పత్తి సామర్థ్యం రోజుకు సుమారు 230 మిలియన్ క్యూబిక్ మీటర్ల వరకు తగ్గిపోయిందని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఇదివరకే వెల్లడించింది. ఇది.. దేశీయ విద్యుత్ సర



ఫరాపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. పవర్ గ్రిడ్లపై లోడ్ పెరిగి అనేక ప్రాంతాల్లో గంటల కొద్దీ కోతలు విధించాల్సి వస్తోందక్కడ. ఇరాన్ తన మొత్తం విద్యుత్‌లో 85 శాతం గ్యాస్ ఆధారిత ప్లాంట్ల నుంచే పొందుతుండటం గమనార్హం. సహజ వాయువు నిల్వల పరంగా రష్యా తర్వాత ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది.. ఇరాన్. ప్రస్తుతం అక్కడ దాదాపు 34 ట్రిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ నిల్వలు ఉన్నాయి. గత ఏడాది అక్టోబర్ లో కూడా దక్షిణ ఇరాన్‌లోని పజాన్ ఫీల్డ్ లో 10 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల గ్యాస్, 200 మిలియన్ బారెళ్ల ముడి చమురు నిల్వలను కనుగొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సహజ వాయు నిక్షేపాలు ఉన్న దేశాల జాబితాలో రష్యా మొదటి స్థానంలో ఉండగా, ఇరాన్ రెండో స్థానంలో కొనసాగుతోంది. ఇరాన్ వద్ద సుమారు 34 ట్రిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ నిల్వలు ఉన్నట్లు అంచనా. దేశీయంగా ఇరాన్ తన విద్యుత్ అవసరాలలో దాదాపు 85 శాతాన్ని గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాల నుంచే పొందుతోంది. గత ఏడాది అక్టోబర్‌లో దక్షిణ ఇరాన్‌లోని పజాన్ ఫీల్డ్‌లో 10 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల గ్యాస్ మరియు 200 మిలియన్ బారెళ్ల ముడి చమురు నిల్వలను కనుగొన్నారు. తాజా అన్వేషణతో ఇరాన్ ఇంధన సామర్థ్యం మరింత బలపడింది. ఇరాన్ తాజా సహజ వాయు నిక్షేపాల ప్రకటన ఆ దేశ దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకు ఒక పెద్ద ఆశాకిరణం. ఈ 7.5 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల నిల్వల్లో దాదాపు 5.7 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల గ్యాస్‌ను విజయవంతంగా వెలికితీయవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, అమెరికా ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిళ్లు మరియు దెబ్బతిన్న ప్లాంట్ల పునరుద్ధరణ వంటి సవాళ్లను అధిగమిస్తేనే ఇరాన్ ఈ సరికొత్త సంపదను పూర్తి స్థాయిలో వినియోగించుకోగలదు. పశ్చిమాసియా రాజకీయ సమీకరణాల నడుమ ఇరాన్ ఇంధన రంగం భవిష్యత్తు ఎటువైపు పయనిస్తుందనేది రానున్న కాలం నిర్ణయించనుంది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp: 74369 39999

# ఆదివాసి యువత ఉద్యమించాలి

అడవి తల్లి ఒడిలో ప్రకృతి దైవంగా జీవనాన్ని కొనసాగిస్తున్న వారే ఈ దేశ మూలవాసులు అనే మాట కేవలం ఒక నినాదం కాదు. ఇది తరతరాలుగా అడవులు, కొండలు, వాగులు, నదులు, భూములతో సహజీవనం చేస్తూ వచ్చిన ఆదివాసీ సమాజం యొక్క అస్తిత్వ ప్రకటన. ప్రకృతిని కాపాడుతూ, ప్రకృతితో కలిసి జీవిస్తూ, తమ ప్రత్యేక సంస్కృతి, భాష, ఆచారాలు, సంప్రదాయాలను తరతరాలకు అందించిన సమాజమే ఆదివాసీ సమాజం ."ఆదివాసి" అనే పదం సాధారణంగా ఒక ప్రాంతానికి చారిత్రకంగా మూలవాసులుగా ఉన్న ఆదివాసి సమాజాలను సూచిస్తుంది. భారత రాజ్యాంగంలో వీరిలో అనేక సమూహాలు షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ST)గా గుర్తించబడ్డాయి. తెలంగాణలో కోయ, గోండ్, కొండరెడ్డి, నాయక్‌పోడ్, కొలాం, పర్ధాన్, అంధు, మన్య వార్, చెంచు తదితర అనేక ఆదివాసీ సమూహాలు నివసిస్తున్నాయి. ప్రతి తెగకు ప్రత్యేకమైన భాష, యాస, జీవన విధానం, పండుగలు, ఆచారాలు, కళలు, జానపద సంప్రదాయాలు ఉన్నాయి. ఈ వైవిధ్యమే భారతదేశ సాంస్కృతిక సంపదలో ఒక ముఖ్యమైన భాగం. ఆదివాసుల జీవితం అడవితో విడదీయలేనిది. అడవి వారికి కేవలం చెట్లు, కలపకు సంబంధించిన ప్రాంతం కాదు. అది వారి జీవనాధారం, ఆహారం, ఔషధం, సంస్కృతి, ఆర్థిక వ్యవస్థ, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ఆధారం. చిన్న వన ఉత్పత్తులు, తేనె, చింతపండు, ఇప్పపువ్వు, పారేటాకులు, పండ్లు, విత్తనాలు వంటి అనేక వనరులు ఆదివాసీ కుటుంబాల జీవనంలో కీలక పాత్ర పోషిస్తాయి.

అందుకే ఆదివాసీ అభివృద్ధి అంటే అడవిని నాశనం చేసి అభివృద్ధి చేయడం కాదు. అడవిని కాపాడుతూ ఆదివాసుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం. ఆదివాసి ప్రజలకు నీరు, అడవి, భూమి హక్కులు అస్తిత్వం ఆదివాసీ సమాజానికి భూమి కేవలం ఆస్తి కాదు. అది వారి కుటుంబం, సంస్కృతి, జీవన విధానం, భవిష్యత్తుతో ముడిపడి ఉంటుంది. ఈ మధ్యకాలంలో ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనేతరుల చొరబాటు అధికమై భూస్వామ్య సమస్యలు, అక్రమ ఆక్రమణలు, బినామీ లావాదేవీలు, అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులవడం వంటి సమస్యలు అనేక ప్రాంతాల్లో ఆదివాసీ కుటుంబాలపై ప్రభావం చూపుతున్నాయి .ఈ నేపథ్యంలో భూమి హక్కులు, అటవీ హక్కులు, సంప్రదాయ జీవనాధారాల



రక్షణ అత్యంత ప్రాధాన్యమైన అంశాలకు ప్రమాదం పొంచి ఉంది. అనేకమంది ఆదివాసి పోరాట యోధులు ఆదివాసి ప్రజల రక్షణ కోసం ఉద్యమాలు, పోరాటాలు ప్రాణ త్యాగాలు చేసిన ఫలితంగా మొట్టమొదటి భారత స్వాతంత్ర సమరయోధుడు బిర్సా ముండా స్ఫూర్తితో జైపాల్ సింగ్ ముండా ఆదివాసులకు రాజ్యాంగంలో ప్రత్యేకంగా 5, 6వ షెడ్యూల్డ్ లను రూపొందించిన భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఆదివాసీ సమాజం ప్రత్యేక పరిస్థితులను గుర్తించి ప్రత్యేక రక్షణలను కల్పించింది. ఆర్టికల్ 244 ద్వారా 5వ మరియు 6వ షెడ్యూల్ ప్రాంతాల పరిపాలనకు రాజ్యాంగపరమైన వ్యవస్థను కల్పించారు. తెలంగాణలోని షెడ్యూల్డ్ ఏరియాలు 5వ షెడ్యూల్ పరిధిలోకి వస్తాయి. 5వ షెడ్యూల్ ఉద్దేశం కేవలం పరిపాలన కాదు. ఆదివాసీ భూములు, సంప్రదాయ జీవన విధానం, సామాజిక ప్రయోజనాలు మరియు ప్రత్యేక హక్కులను రక్షించడం కూడా దాని ప్రధాన లక్ష్యాలలో ఒకటి. 1/70 యాక్ట్,

పెసా చట్టం, 1996, అటవీ హక్కుల చట్టం, 2006 వంటి చట్టాలు కూడా షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గ్రామసభలకు మరియు అటవీ ఆధారిత ఆదివాసీ సమాజాలకు ముఖ్యమైన హక్కులను కల్పించారు. ఆదివాసులకు ప్రత్యేకమైన హక్కులు చట్టాలు ఉన్న వివిధ కారణాల చేత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ... ఆదివాసులకు దక్కవలసిన విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలను వలసవాదులు గద్దల్ల తన్నుకు పోతున్నారు. అడవి బిడ్డలు ఆదివాసుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మా హక్కులు అమలు చేయండి. మా బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు కల్పించండి. మా భూములు రక్షించండి. మా జీవనం విధ్వంసం చేయకండి అని ఆదివాసుల ఆర్తనాదాలు ఆలకించే వారే లేరు. ఆదివాసీ సమాజం అభివృద్ధికి విద్య అత్యంత కీలకం. గ్రామీణ మరియు ఏజెన్సీ ప్రాంతాల్లో నాణ్యమైన పాఠశాలలు, ఉపాధ్యాయులు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, ఇంటర్మీడియట్, డిగ్రీ, సాంకేతిక మరియు ఉన్నత విద్యా అవకాశాలు మరింత బలోపేతం కావాలి."విద్య హక్కు... విద్య అమ్మకపు వస్తువు కాదు."ఆదివాసీ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు నిరంతర విద్యను పొందేలా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా బాలికల విద్య, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, పోటీ పరీక్షల శిక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యత అవసరం. ఏజెన్సీ ఆదివాసి ప్రజల కనీస ప్రాథమిక అవసరాలను తీర్చేందుకు ఏర్పాటుచేసిన ఐటీడీఏలు ఉన్నా లేనట్లుగానే ప్రాజెక్టు అధికారుల పనితీరు కనిపిస్తుంది.

ఉద్యోగ, ఉపాధి ద్వారానే యువత భవిష్యత్తు విద్యావంతులైన ఆదివాసీ యువతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించకపోతే సామాజిక అభివృద్ధి అసంపూర్ణంగా ఉంటుంది. షెడ్యూల్డ్ ఏరియాల్లో రాజ్యాంగం, చట్టాలు మరియు ప్రభుత్వ విధానాల ప్రకారం స్థానిక ఆదివాసీ యువతకు లభించాల్సిన అవకాశాలు సమర్థవంతంగా అమలు కావాలి. ఉద్యోగ నియామకాల్లో చట్టపరమైన నిబంధనలు స్పష్టంగా ఉండాలి. నోటిఫికేషన్లలో గందరగోళానికి అవకాశం లేకుండా స్థానిక హక్కులు, రిజర్వేషన్లు, రోస్టర్ విధానం స్పష్టంగా ప్రకటించాలి. ఆదివాసులకు ఉన్న హక్కులు, చట్టాలను అమలు చేయకుండా ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి 100% రిజర్వేషన్ సాకుతో ఉన్న జీవో : 3ని గిరిజనేతరుల కుట్రల వల్ల సుప్రీంకోర్టు కొట్టి వేసిందనే సాకుతో తెలంగాణ ప్రజా ప్రభుత్వం 2026 పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ విడుదల చేసిన నోటిఫికేషన్లు స్థానిక ఆదివాసి నిరుద్యోగులకు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పోలీస్ స్టేషన్ పరిధిలో (సివిల్) కానిస్టేబుల్ కు 75% రిజర్వేషన్ అమలు చేయాలని జీవో: 109 స్పష్టం చేసిన రేవంత్ సర్కార్ పెడచెవిన పెట్టింది. అన్నీ ఉన్నా ఆదివాసులకు అన్యాయం జరుగుతున్న మాట వాస్తవం. ఆదివాసీ సమాజం యొక్క గొప్ప సంపద వారి సంస్కృతి.

గుస్సాడి, కోయ నృత్యాలు, జానపద గీతాలు, సంప్రదాయ వాద్యాలు, వేల్పుల జాతరలు, (సీజనల్) భూమి, కొత్తలు, పెద్దలు, ఇప్పపువ్వుల పండుగలు, వైద్యం, ఆహార సంస్కృతి, సంప్రదాయ జ్ఞానం——ఇవన్నీ తరతరాలుగా పూర్వీకుల నుండి వస్తున్న అమూల్య వారసత్వం.ఆధునికతను స్వీకరించడం అవసరమే. కానీ ఆధునికత పేరుతో భాషను, సంస్కృతిని, ఆచారాలను, సంప్రదాయ జ్ఞానాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదు. ఆదివాసీ పిల్లలకు ఆధునిక విద్యతో పాటు వారి మాతృభాష, చరిత్ర, సంస్కృతి గురించి కూడా అవగాహన కల్పించాలి. ఇప్పటివరకు ఈ ప్రయత్నం అటు ప్రభుత్వాలు గానీ ఇటు ఐటిడిఏలు గాని చెయ్యకపోవడం సూచనీయం. కేంద్ర, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు మాత్రం ఆదివాసుల అభివృద్ధి కోసం సంస్కృతి, సాంప్రదాయాలను ముందుకు తీసుకపోవడంలో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు కాగితాల మీద లెక్కలు చూపిస్తున్నారు. ఆదివాసీ సమాజంలో మహిళల పాత్ర అత్యంత కీలకం. కుటుంబ ఆర్థిక వ్యవస్థ నుంచి వ్యవసాయం, అటవీ ఆధారిత జీవనోపాధి, పిల్లల సంరక్షణ, సాంస్కృతిక పరంపర కొనసాగింపు వరకు వారు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆదివాసీ మహిళలకు విద్య, ఆరోగ్యం, ఉపాధి, స్వయం ఉపాధి, భద్రత మరియు నిర్ణయాధికారంలో మరింత అవకాశాలు కల్పించాలి. ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి అంటే రోడ్లు, విద్యుత్, తాగునీరు,ఆసుపత్రులు, పాఠశాలలు, ఇంటర్నెట్, రవాణా వంటి మౌలిక సదుపాయాలు అవసరం. కానీ అభివృద్ధి పేరుతో ఆదివాసులను వారి భూమి, అడవి, జీవనాధారాల నుంచి దూరం చేయడం అభివృద్ధి కాదు."ఆదివాసుల కోసం అభివృద్ధి కావాలి; ఆదివాసులను తొలగించే అభివృద్ధి కాదు." అభివృద్ధి ప్రణాళికల్లో స్థానిక ఆదివాసి ప్రజల అభిప్రాయానికి, గ్రామసభల పాత్రకు, రాజ్యాంగ రక్షణలకు ప్రాధాన్యత ఉండాలి. కానీ అందుకు భిన్నంగా ఏజెన్సీ ప్రాంతాలలో రాజ్యాధికారం వలసవాదుల కబంధ హస్తాల్లో బందీ అయి ఉంది. అందుకే ఆదివాసులు అభివృద్ధికి నోచుకోవడం లేదు.నేటి ఆదివాసీ సమాజం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. భూమి మరియు అటవీ హక్కుల సమస్యలు, విద్యా వెనుకబాటుతనం, పిల్లల డ్రాపౌట్లు,నిరుద్యోగం,ఆరోగ్య సదుపాయాల కొరత,పోషకాహార సమస్యలు, గిరిజనేతరల వలసలు ,మౌలిక వసతుల కొరత, మాతృభాషల పరిరక్షణ సమస్య,సంస్కృతి, సంప్రదాయాలపై పెరుగుతున్న ప్రభావాలు

ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు షెడ్యూల్డ్ ఏరియా హక్కులు, చట్టాల అమలులో సమస్యలు ప్రభుత్వాలు ఈ సమస్యలను ఒక్కో అంశంగా కాకుండా సమగ్ర ఆదివాసీ అభివృద్ధి విధానం ద్వారా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఆదివాసీ హక్కుల కోసం పోరాటం అంటే ఇతర సమాజాలకు వ్యతిరేకంగా పోరాటం కాదు. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలు కోసం ప్రజాస్వామ్య పోరాటం. ఆదివాసి ప్రజా సంఘాలు, ఉద్యోగులు, యువకులు, విద్యావంతులు, హక్కులు,చట్టాలను మరియు రాజ్యాంగం గురించి తెలుసుకుని, తమ హక్కులను ప్రజాస్వామ్య పద్ధతుల్లో కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరం ఆదివాసి "Zen జీ" యువకులు, విద్యార్థుల పైన ఉంది. సమాజంలో ఐక్యత, విద్య, చైతన్యం, ఆత్మగౌరవం పెంపొందించాలి. అడవిని కాపాడిన వారసులం.

భూమిని తల్లిగా భావించిన వారసులం. ప్రకృతిని దేవతగా ఆరాధించిన వారసులం. మన సంస్కృతిని తరతరాలకు అందించిన వారసులం. మనకు దానం అవసరం లేదు. రాజ్యాంగ హక్కులు అమలు కావాలి. మనపై కనికరం అవసరం లేదు. మనకు సమాన గౌరవం కావాలి. మన సంస్కృతిని చెరిపివేయడం కాదు. మన సంస్కృతిని గౌరవించాలి. మన భూములను కోల్పోవడం కాదు. మన భూమి, అడవి, జీవనాధారాలను రక్షించాలి. మన యువతకు హామీలు కాదు. నాణ్యమైన విద్య, ఉపాధి, అవకాశాల కోసం ఆదివాసి యువత ఉద్యమింTచాలి.

**డాక్టర్. సాగబోయిన పాపారావు**
**ఆదివాసి స్టూడెంట్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ.**
**సెల్ నెంబర్ :9441288991**

# విపత్తులకు ఎదురునిలుస్తున్న జపాన్

ప్రకృతి ప్రకోపానికి ఎదురు నిలిచి, సాంకేతికతతో విజయం సాధిస్తున్న దేశం జపాన్. ప్రపంచాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసే ప్రకృతి వైపరీత్యాలలో భూకంపాలు అత్యంత భయానకమైనవి. ఇటీవల జపాన్‌ను ఆదివారం రోజు వరుస భూకంపాలు వణికించిన వైనం మరోసారి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది. తెల్లవారుజామున రాజధాని నగరం టోక్యో, సమీప జిల్లాల్లో సంభవించిన ప్రకంపనల ధాటికి 40 మందికిపైగా గాయపడ్డారు. ఆ భయం వీడక ముందే, రాత్రి వేళ ఉత్తర జపాన్ హొక్కయిడో ప్రాంతంలో 6 తీవ్రతతో మరో శక్తివంతమైన భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 10.45 గంటలకు, హొక్కయిడోకు సమీపంలోని సముద్ర ప్రాంతంలో 40 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు జపాన్ మెట్రోలాజికల్ ఏజెన్సీ గుర్తించింది. ఈ ప్రకంపనల తీవ్రత జపాన్ సీస్మిక్ ఇంటెన్సిటీ స్కేల్ (గరిష్ఠంగా 7) ప్రకారం 4 గా నమోదైంది. రాత్రి వేళ ఒక్కసారిగా భూమి కంపించడంతో ఇళ్లలోని వస్తువులు కదిలిపోయి, ప్రజలు ప్రాణభయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. అయితే, ఈ భూకంపాల వల్ల సునామీ ప్రమాదమేమీ లేదని అధికారులు ధ్రువీకరించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కానీ, ఒక్కరోజులోనే రెండుసార్లు భూమి కంపించడం అక్కడి ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. జపాన్‌లో భూకంపాలు సర్వసాధారణం కావడానికి ప్రధాన కారణం అక్కడి భౌగోళిక , ఫలకాల కదలికల ప్రత్యేక పరిస్థితే. జపాన్ ప్రపంచంలోనే అత్యంత భూకంపాలు సంభవించే సున్నితమైన ప్రాంతమైన 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్' పరిధిలో ఉంది. ప్రపంచంలోని మొత్తం భూకంపాలలో దాదాపు 20 శాతం ఇక్కడే సంభవిస్తాయి. జపాన్ భూభాగం నాలుగు ప్రధాన టెక్టోనిక్ ఫలకాలు (పసిఫిక్, ఫిలిప్పీన్ సీ, యురేషియన్, మరియు నార్త్ అమెరికన్ ప్లేట్లు) కలిసే కూడలిలో ఉంది. ఈ ఫలకాలు నిరంతరం ఒకదానికొకటి వ్యతిరేక దిశలో కదులుతూ, ఒకదాని కిందకి మరొకటి చొచ్చుకుపోతుంటాయి. ఈ క్రమంలో భూమి పొరల్లో ఏర్పడే తీవ్రమైన ఘర్షణ మరియు ఒత్తిడి ఒక్కసారిగా విడుదలైనప్పుడు శక్తివంతమైన భూకంపాలు పుట్టుకొస్తాయి. సముద్ర గర్భంలో ఏర్పడే ఈ కదలికల వల్లే కొన్నిసార్లు సునామీలు కూడా ముప్పుగా మారుతుంటాయి. ప్రకృతి ఎంతటి విలయాన్ని సృష్టించినా, దాన్ని ఎదుర్కొనేందుకు జపాన్ ప్రజలు, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఆదర్శప్రాయం. భూకంపాలను ముందుగానే పసిగట్టే అధునాతన హెచ్చరిక వ్యవస్థలు, భూకంపాలను తట్టుకునే పటిష్టమైన నిర్మాణ శైలి కారణంగానే ప్రాణ నష్టాన్ని గణనీయంగా నివారించగలుగుతున్నారు.

**మహా డెస్క్**





# ఇబ్రహీం మృతి బాధాకరం

- **ప్రభుత్వ విప్ వేముల వీరేశం**

**యాదాద్రి భువనగిరి, మహా న్యూస్** : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట పట్టణ కేంద్రంకి చెందిన సీనియర్ పాత్రికేయుడు ఎండి ఇబ్రహీం ఇటీవల అనారోగ్యం కారణాలవల్ల మృతి చెందడం జరిగింది సోమవారం దశదినకర్మకు హాజరైన ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఇబ్రహీం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ సీనియర్ పాత్రికేయుడుగా ప్రజల మధ్యలో ఉంటూ మంచి పేరు సంపాదించుకున్నాడని కొనియాడారు నిజాయితీగా నీ భద్రతతో పాత్రికేయ వృత్తిని నిర్వహిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు ఇబ్రహీం మృతి పత్రిక రంగానికి తీరని లోటు అన్నారు ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు ఈ సమావేశంలో పాత్రికేయులు నాయకులు పాల్గొన్నారు

# పదవి కంటే ప్రజాసేవే ముఖ్యం : కేఎల్ఆర్!

- **ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు**
- **మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి**
- **నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా**
- **కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**



**మహేశ్వరం ఆగస్టు 24 మహా**: ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్న మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా తనదైన ముద్ర వేస్తున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలు, విద్యార్థులు, యువత, మహిళలు, వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యంగా కేఎల్ఆర్ ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుబబ, నాయకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వాటికి పరిష్కార మార్గాలు చూపించడం ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తున్నారు.

పదవి కంటే ప్రజాసేవే ముఖ్యమన్న కేఎల్ఆర్!..
"పదవి కంటే ప్రజాసేవే ముఖ్యమనే ఆలోచనతో, మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అనే సంకల్పంతో కేఎల్ఆర్ పనిచేస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. మహేశ్వరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కేఎల్ఆర్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి.



# గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- **ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్**

**జూలూరుపాడు, మహా**:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో గిరిజన సమస్యలు అధికంగా ఉన్నాయని, ఈ ప్రాంత గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ కి జూలూరుపాడు బిజెపి మండల అధ్యక్షుడు భూక్యా రమేష్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎలమంద నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గిరిజన సమస్యలు అధికంగా ఉన్నాయని అన్నారు. ఆ సమస్యలను రాతపూర్వకంగా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తమ సమస్యలు విన్నవించేందుకు గిరిజన ప్రజలు నేరుగా నన్ను కలవచ్చునని తెలిపారు. గిరిజన నాయకులు మండలంలోని వివిధ సమస్యల పై ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యామ్ రాథోడ్, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరి రమేష్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, బిజెపి మండల అధ్యక్షుడు భూక్య రమేష్, సిరిపురపు ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శులు భూక్య శ్రీను, నిమ్మటూరు రామారావు, ధారావత్ బాలకిషన్, గుగులోతు రాంబాబు, భూక్యచరణ్, బాబూలాల్, భూక్య రవి, కిష్టంశెట్టి గోపాలరావు, నవీన్, పృథ్వి, వందనపు సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ మండల స్థాయి సమావేశం

**జూలూరుపాడు, మహా:**మండల పరిధిలోని పడమట నర్సాపురం రైతువేదికలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మండల స్థాయి సమావేశాన్ని స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, సర్పంచ్ లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో భాగంగా ప్రస్తుత ఓటర్లను 2002 ఓటర్ల జాబితా వివరాలతో ఇప్పటి వరకు మ్యాపింగ్ చేయడం జరిగిందని తెలిపారు. కానీ కొందరి వివరాలు 2002 లో లేనందున మ్యాపింగ్ చేయలేకపోయామన్నారు . మ్యాపింగ్ చేసిన వారిలో కొన్ని తప్పులు గుర్తించటం జరిగిందని తెలిపారు. వారందరికీ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 27 నుండి నోటీసులు ఇవ్వడం జరుగుతుందన్నారు. వారందరూ వారికి కేటాయించిన తేదీ, సమయం, స్థలానికి వచ్చి వారి ధృవీకరణ పత్రాలు సమర్పించాలని కోరారు.



# ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి

- **మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా** : ప్రజావాణి దరఖాస్తులను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి జిల్లా నలుమూలల నుండి వివిధ సమస్యల పరిష్కారం కొరకు వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన ఝాన్సీ స్వయం సహాయక సంఘం సభ్యులు తమ సంఘంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన మహమ్మద్ మక్బూల్ పెద్ద మనుషుల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం తనకు రావలసిన వాటాను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్ వాసులు తమ కాలనీలో రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కొండగొర్ల చంద్రశేఖర్ తమకు కన్నేపల్లి మండలం పోలంపల్లి శివారులో గల భూమి ఆన్ లైన్ లో ఇతరుల పేరిట నమోదు అయిందని, ఈ పొరపాటును సవరించి తమ పేరిట మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం ఊత్కూర్ కు చెందిన తనుగుల సందీప్ కుమార్ తాను, తన భార్య దివ్యాంగులమని, నిరుపేదలమని, తమకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని భగత్ సింగ్ నగర్ టు చెందిన ఎం.ప్రభావతి తనకు కొంత స్థలం ఉందని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామానికి చెందిన తగరం పరంజ్యోతి తమ భూమి నిషేధిత జాబితాలో చూపు తోందని, సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం నంబాల గ్రామానికి చెందిన శనిగారపు బాపు తమ ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని, భూమి కాగితాలు, ఖరీదైన వస్తువులు, మంచాలు, బట్టలు పూర్తిగా కాలిపోయాయని, తమ కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న
# వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలి

- **భూ బాధితులు బేతం జాన్ (అంజయ్య), సుందర్, రాకేష్ ల విజ్ఞప్తి.**




**బెల్లంపల్లి,మహా**:. బెల్లంపల్లి పట్టణంలోని కూరగాయల మార్కెట్ నుండి బెల్లంపల్లి బస్తీకి వెళ్లే దారిలో పవర్ హౌస్ పక్కన తమ ఇంటి ముందు ఉన్న ఖాళీ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని భూ బాధితులు బేతం జాన్ తో పాటు ఆయన కుమారులు సుందర్,రాకేష్ లు సోమవారం రోజు బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ (టేకుల బస్తి) కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అధికారులకు విజ్ఞప్తి చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత స్థలాన్ని కబ్జా చేసేందుకు ఇల్లు లేకుండానే ఇంటి నంబర్ , ఎక్కడిదో నంబర్ చూపెడుతూ, తమ ఇంటి ముందు స్థలాన్ని తనదే అంటూ సంబంధిత భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న అదే బస్తీకి చెందిన ఎండి గౌస్, ఆయన కుమారులు సల్మాన్, ఇమ్రాన్, పై చర్యలు తీసుకోని మా స్థలాన్ని తమకు అప్పగించాలన్నారు. బెల్లంపల్లి బస్సుకి చెందిన ఎండి గౌస్ ఆయన కుమారులు సల్మాన్, ఇమ్రాన్ (న్యాయవాది) ప్రభుత్వ భూములను, ప్రజల భూములను కబ్జా చేయడానికి కోర్టులను, మున్సిపల్ అధికారులను తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి మోసం చేస్తూ భూములను కబ్జాచేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు అందులో భాగంగానే 70 సం.లుగా నివాసముంటున్న ఇంటి ముందర ఉన్న స్థలాన్ని తనదంటూ ఇంటి నెంబర్14 2 1/1/A/1 తో ఎక్కడిదో నంబర్ తీసుకువచ్చి ఇదే మా ఇంటి నెంబర్ అంటూ మమ్ములను బెదిరింపులకు గురి చేస్తూ, కోర్టు ద్వారా నోటీసులు పంపించారని, తమకు పంపించిన నోటీసులపై న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి కోర్టులను మున్సిపల్ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తులపై చట్టపరంగా విచారణ జరిపించి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, స్థానిక రెవెన్యూ,మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ అధికారులకు తప్పుడు సమాచారాన్ని ఇచ్చి ఇల్లు లేకుండానే ఇంటి నెంబర్ తీసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్న ఇంటి నెంబర్ ను రికార్డుల నుండి వెంటనే తొలగించాలన్నారు.

# రైతాంగ ఉద్యమానికి సారంపల్లి మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయం

- **సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్**



**సత్తుపల్లి,ఆగస్టు 24**: మహా : రైతాంగ ఉద్యమానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి సారంపల్లి మల్లారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ అన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి మృతికి సంతాపంగా సీపీఎం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గంగారం గ్రామంలో ప్రజాసంఘాల కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మల్లారెడ్డి జీవితాంతం కమ్యూనిస్టు ఉద్యమానికి, రైతాంగ పోరాటాలకు అంకితమై పనిచేశారని కొనియాడారు. రైతుల సమస్యలు, వ్యవసాయ రంగం, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలపై మల్లారెడ్డికి విశేషమైన అవగాహన ఉండేదన్నారు. రైతుల హక్కుల కోసం ఆయన సాగించిన పోరాటాలు, ప్రజా ఉద్యమాల్లో పోషించిన పాత్ర ఎప్పటికీ గుర్తుండి పోతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిబద్ధతతో పోరాడిన మల్లారెడ్డి ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని జాజిరి శ్రీనివాస్ అన్నారు. రైతులు, కార్మికులు, పేదలు, సామాన్య ప్రజల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సంతాప సభలో సీపీఎం నాయకులు కావూరి వెంకటేశ్వరరావు, కువ్వారపు లక్ష్మణరావు, పొలాసి భాగ్యమ్మ, దేవల్ల రామారావు, గుంట్రు జయరాజు, కొలికపోగు రత్తయ్య, రాజేష్, మారేశ్వరి, మరియమ్మ, మద్దిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 25న వనమహోత్సవం : ఎంపీడీఓ రవి

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 25న వనమహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తాళ్లూరి రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వనమహోత్సవంలో ఆయా గ్రామాల సర్పంచ్ లు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, యువత, మహిళలు, గ్రామ ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని కోరారు. చెట్లు మనకు ప్రాణవాయువును అందిస్తాయని, వాతావరణ సమతుల్యతను కాపాడడంతోపాటు, ఉష్ణోగ్రతలను తగ్గించి వర్షపాతానికి దోహదపడతాయని తెలిపారు. అదేవిధంగా భూసారాన్ని, భూగర్భ జలాలను, పక్షులు, జంతువులకు ఆవాసాన్ని కల్పిస్తాయన్నారు. ముఖ్యంగా మన భావితరాలకు ఆరోగ్యకరమైన పచ్చని వాతావరణాన్ని అందించడంలో చెట్ల పాత్ర ప్రధానమైనది అన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ వనమహోత్సవాన్ని ఒక



సామాజిక బాధ్యతగా భావించి "ఒక్కొక్కరు ఒక మొక్క - పచ్చని భవిష్యత్తుకు బాట" అనే స్ఫూర్తితో మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. ప్రతి గ్రామ పంచాయతీలో వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, మండలాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రకటనలో కోరారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి షఫీని సన్మానించిన తల్లాడ జర్నలిస్టులు

**తల్లాడ, ఆగస్టు 24, మహా :** ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థి షేక్. షఫీని తల్లాడ జర్నలిస్టులు సోమవారం సన్మానించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఖమ్మం జిల్లాలో ఆయన విస్తృతంగా ప్రచారం చేపడుతూ పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో తల్లాడకు వచ్చిన ఆయనను తల్లాడ పాత్రికేయులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో సీనియర్ జర్నలిస్టులు ఎండి బహదూర్, గుడిపల్లి నారాయణ, షేక్ మేహరాజ్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఇజ్రాయిల్, తదితరులు ఉన్నారు.





# కుటుంబ కలహాలతో మామను హత్య చేసిన అల్లుడు

**కుషాయిగూడ, మహా :** అల్లుని చేతిలో మామ హత్యకు గురైన సంఘటన జవహర్ నగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని అండాలు భర్త మొగిలి (44) తో కలసి నివసిస్తున్నారు. ఈ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు మొగిలి పొరుగు వారితో తరచుగా గొడవలు జరుగుతున్న కారణంగా గత పది సంవత్సరాల నుండి ఈ దంపతులు సాయిబాబా కాలనీలో నివసిస్తున్నారు. ఈనెల 23వ తేదీన దొండ తోటలోని తన పెద్ద కుమార్తె ఇంటికి బోనాల ఉత్సవాలకు రాగా ఆదివారం సాయంత్రం బయటికి వెళ్లి రాత్రి 8 గంటలకు ముఖంపై గాయాలతో మొగిలి తిరిగి వచ్చాడు. తర్వాత మొగిలి తన అల్లుడు శివతో గొడవకు దిగినట్టు తెలిసింది. ఈ క్రమంలో జరిగిన వాగ్వివాదంలో మొగిలి అల్లుని ఇల్లుని ధ్వంసం చేసి విద్యుత్ వైరును తొలగించి శివకు చెందిన మోటార్ సైకిల్ ని కూడా ధ్వంసం చేశాడు. దీంతో కోపోద్రిక్తుడైన అల్లుడు శివ సుత్తితో మొగిలితలపై రెండుసార్లు బలంగా కొట్టగా మొగిలి స్పృహ కోల్పోగా శివ అక్కడ నుంచి పారిపోయాడు. ఈ మేరకు మొగిలి భార్య 108 అంబులెన్స్ కు సమాచారం అందించగా అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మొగిలిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు తన భర్త మొగిలిని అల్లుడు శివ సుత్తితో తలపై కొట్టడం వల్లనే మృతి చెందాడని, భార్య అండాలు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# కారేపల్లి షాదీ ఖానా అధ్యక్షులుగా ఎండీ. యాకూబ్ అలీ

**ఉత్తర్వులు అందజేసిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాంబాబు**

**కారేపల్లి, మహా:** కారేపల్లి షాదీఖానా నూతన కమిటీని సోమవారం ప్రకటించారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సిఫార్సు తో ప్రభుత్వం షాదిఖాన కమిటీ అధ్యక్షులుగా ఎండి యాకూబ్ అలీ నియామకం జరిగింది. దీనికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోటకూర రాంబాబు చేతుల మీదుగా ఎండి.యాకూబ్ అలీకి అందజేశారు. ఉపాధ్యక్షులుగా షేక్ మజీద్ పాషా (షేర్), కార్యదర్శిగా ఎండీ సల్మా, సభ్యులుగా షేక్ యాకుబ్ పాషా, షేక్ ఖదీర్ లను నియమించారు. అనంతరం నూతన కమిటీ నియామక పత్రాలను తహసీల్దార్, ఎంపీడీవోలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ), మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్, మాజీ మండల కో ఆప్షన్ ఎండీ హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.



## కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్

**ఆదిలాబాద్** : ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ ఏర్పాటు చేసినట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం ప్రజా సేవా భవన్ లో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కు ఆయన హాజరయ్యారు. నియోజకవర్గంలోని ప్రజలు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యల పై కంది శ్రీనివాస రెడ్డి కి వినతి పత్రాలు అందించారు. సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ప్రజాదర్బార్ ద్వారా అనేక సమస్యలు పరిష్కారమయినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు బండారి సతీష్ , ఇజ్జగిరి సంజయ్, ఖిజర్ పాషా, సుధాకర్ రెడ్డి లోక ప్రవీణ్ రెడ్డి, కొండ గంగాధర్ , మునిగెల నర్సింగ్ , మునిగెల విటల్, గుడిపల్లి నగేష్,శాంతన్ రావు,భోజారెడ్డి దాసరి ఆశన్న, షాహిద్ ఆలీ, మహబూబ్ , చరణ్ గౌడ్, రాందాస్ నాక్లే , బిక్కి గంగాధర్, అశోక్ ఠాక్రె, సుదర్శన్ అల్చెట్టి నాగన్న, కోలా నర్సింలు,సుఖేందర్ , అన్నపూర్ణ ,స్వాతి కాంబ్లే, మంచికట్ల ఆశమ్మ, శ్రీలేఖ,కావేటి జ్యోతి ,సోనియా జుబేదా, రఫీఖ్, ఎంఏ షకీల్ ,వెంకట్ యాదవ్, బత్తుల శ్రీనివాస్, బాపూరావు,ఆత్రం నగేష్, కమలాబాయి, నితిన్ బోయర్,వేణుగోపాల రెడ్డి,వామన్,నిమ్మల గౌతం రెడ్డి ,ఆతిఖ్ , శ్యామ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## చిరుతపులి చర్మం గోర్లు స్వాధీనం

- **నలుగురు వ్యక్తుల అరెస్ట్**
- **వివరాలను వెల్లడించిన ఎస్పీ రోహిత్ రాజు**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** చిరుతపులి చర్మం గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిరుతపులి చర్మం గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు వ్యక్తులు చల్లా అనిల్ కుమార్, కుంజ భద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్యలను బూర్గంపహాడ్ పోలీసులు టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లుగా చెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు, బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగ బిక్షం, టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో తాళ్ల గొమ్మూరు గ్రామం అనిల్ అనే వ్యక్తి ఇంటి వద్ద ఒక చిన్న బ్యాగ్‌తో అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లుగా తెలిపారు. నిందితులు గత సంవత్సరం వేసవి కాలంలో చింతూరు మండలం గమ్మలకోట గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో గుంతలో పడిపోయి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్న చిరుతపులిని రాళ్లు కర్రలతో కొట్టి భాణాలు విసిరి చంపినట్లు తెలిపారు. అనంతరం దాని చర్మం గోర్లను తొలగించి చర్మాన్ని ఎండబెట్టి గోర్లను భద్రపరిచి ఉంచినట్లు వెల్లడించారు. తరువాత చిరుతపులి చర్మం గోర్లను విక్రయించి డబ్బు సంపాదించాలని ప్రయత్నిస్తుండగా సారపాకకు చెందిన చల్లా అనిల్ కుమార్ అనే వ్యక్తి భూమిని కౌలుకు తీసుకునే వ్యవసాయం చేయుట కొరకు గమ్మలకోట గ్రామం చింతూరు మండలంకు చెందిన కుంజా భద్రయ్య వద్దకు రాగా అతనిని సంప్రదించినట్లు తెలిపారు. అనిల్ కుమార్ కొనుగోలుదారులను సంప్రదించి విక్రయానికి సహకరిస్తానని చెప్పడంతో కుంజ భద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్య ముగ్గురు కలిసి చిరుతపులి చర్మం గోర్లను ఒక చిన్న బ్యాగ్‌లో పెట్టుకుని తాళ్లగొమ్మూరులోని అనిల్ కుమార్ ఇంటికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో చిరుతపులి చర్మాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి చిరుతపులి చర్మం, 17 గోర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్సైలు నాగ బిక్షం, ప్రవీణ్, సుమన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**కుషాయిగూడ, మహా :** జవహర్ నగర్ లోని సర్కారు భూముల్లో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను కూల్చివేశారు . కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు గిర్దావర్ సత్యనారాయణ సమక్షంలో సోమవారం సంతోష్‌నగర్, చెన్నాపూర్, వికలాంగుల కాలనీ, కార్మికనగర్ లో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ జవహర్ నగర్ లోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, కబ్జాదారులు అక్రమ కట్టడాలు చేస్తే సహించేదే లేదని హెచ్చరించారు. సర్కారు భూములను అమాయక పేదలకు అమ్ముతు సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై ప్రత్యేక నజర్ పెట్టామని, త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూముల రక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, జవహర్ నగర్ ప్రాంతంలోని భూముల్లో ఎలాంటి కట్టడాలు చేపట్టరాదని హెచ్చరించారు.



## కాంగ్రెస్‌లో చేరిన రిటైర్డ్ టీచర్

- **కండువా కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి**

**ఆదిలాబాద్** : ఆదిలాబాద్ రూరల్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన రిటైర్ టీచర్ తూరటి గంగన్న ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్టి భోజారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయనకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

## సీతారామాతో సింగరేణికి చుక్కనీరు రావటం లేదు

- **పోరాటాలతో సీతారామా ప్రాజెక్టు నీళ్లు తెచ్చుకుందాం**
- **కరపటి రాములు వర్ధంతి సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు**



**కారేపల్లి, మహా** : ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు గురించి గొప్పలు చెప్పుతున్నఆ ప్రాజెక్టునుంచి చుక్క సింగరేణి మండలానికి అందని పరిస్థితి ఉందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నానాగేశ్వరరావు తెలిపారు. కారేపల్లి మండలం బాజుమల్లాయిగూడెంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బాజు మల్లయిగూడెం మాజీ సర్పంచ్ కామ్రేడ్ కరపటి రాములు 13వ వర్ధంతి జరిగింది. ఈసందర్భంగా వజ్జా రామారావు అధ్యక్షతన జరిగిన సభలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ సింగరేణి కి వర్షాధార చెరువులు,కుంటలు, వాగులు తప్ప ఎలాంటి సాగునీటి వనరులు లేవన్నారు. గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి మండలం పట్ల నిర్లక్ష్య వైఖరిని ఆవలంబిస్తున్నాయని విమర్శించారు. సింగరేణి మండలానికి సంబంధించిన మధ్య, పేద రైతుల భూములను సీతారామ ప్రాజెక్టు కాలువ క్రింద పోతుందని, దానికి 2013 భూ నిర్వాసితులు చట్టాన్ని అమలుపర్చకుండా అన్యాయం చేస్తుందన్నారు. సింగరేణి మండలానికి నీరు రావాలంటే గుట్టని తొలచాలన్నారు. అమరజీవి కరపటి రాములు పేదలకు అండగా అనేక పోరాటాలకు నేతృత్వం వహించారని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధిగా సౌకర్యాల కల్పనలో ముందుండి ప్రజల మనసు గెలుచుకున్న నాయకుడని కొనియాడారు. పేదల పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కక్ష్య కట్టి వ్యవహరిస్తున్నాయని వాటి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరచి పోరాటాలకు సన్నద్ధం చేయటమే కరపటి రాములుకి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే నరేంద్ర, పీఎన్ఎం నాయకులు కరకపల్లి రాయమల్లు, మండల కమిటీ సభ్యులు సురభాక దనమ్మ యనమనగండ్ల రవిబాబు, సూరబాక సర్వయ్య, శేరు వెంకటేశ్వర్లు, బచ్చల బుజ్జమ్మ, బచ్చల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కరపటి రంబాయమ్మ, సోషల్ మీడియా కన్వీనర్ ధరావత్ వినోద్ కుమార్, భారత లక్ష్మి, బజ్జల వంశీకృష్ణ, ధరావత్ సరిత, కరపటి రాములు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా : సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్.

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలో యూజిడి వర్క్స జిపి పండ్ నుంచి 30 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సోమవారం గ్రామ సర్పంచ్ కట్కూరి కోటేశ్వర్ గౌడ్, ఉప సర్పంచ్ గూడెపు కుమార్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులతో కలిసి పనులను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని గ్రామ సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్ తెలిపారు.ఎమ్మెల్యే సహాయ సహకారాలతో పాలమాకుల గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు.



## బాధలో బాసటగా..

- **కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు**

**ఆదిలాబాద్ మహా** : ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నవారి కుటుంబాలకు ,అనారోగ్యంతో బాధపడుతున్న వారి చెంతకు వెళ్లి వారికి కొండంత ధైర్యాన్ని ఇస్తారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. అనారోగ్యంతో బాధపడుతున్న జైనథ్ మండలం నిరాల గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ ప్రభాకర్ చౌదరి,ఖానాపూర్ కు చెందిన జఫార్ అహ్మద్ , భోరజ్ మండలం గూడ కు చెందిన పొట్ట వెంకటమ్మలను ఆదివారం ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి వారి నివాసంలో పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ప్రమాదవశాత్తు మృతి చెందిన ఖానాపూర్ కు చెందిన దీదీ ఆకాష్, నేతాజీ చౌక్ కు చెందిన వరుణ్ రాజ్ ల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## నేడే డబుల్ బెడ్రూం గృహాలు పేదలకు కేటాయింపు

- **మందమర్రి తాసిల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ వెల్లడి**




**మందమర్రి, మహా :** మందమర్రి మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం గృహాలను నేడు లక్కీ డ్రా ద్వారా నిరుపేదలకు కేటాయిస్తామని స్థానిక తాసిల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ వెల్లడించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూమంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో ప్రకటించిన అర్హుల జాబితా ఆధారంగా ఆగస్టు 25 నాడు ఉదయం 10 గంటలకు సండ్రోన్‌పల్లి గ్రామ పరిధిలోని కే.ఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధికారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులను లక్కీ డ్రా పద్ధతిలో ఎంపిక చేసి, వారికి డబుల్ బెడ్రూం ఇళ్లలోని బ్లాక్, ఫ్లోర్ కేటాయించనున్నట్లు తహసీల్దార్ వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్ బందోబస్తుతో ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు మాత్రమే హాల్ లోకి అనుమతి ఉంటుందని, ఇతరులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. లబ్ధిదారులు తప్పనిసరిగా తమ వెంట ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. కేటాయింపు అనంతరం లబ్ధిదారుల్లో ఎవరైనా అనర్హులు ఉన్నట్లు వ్రాతపూర్వకంగా ఫిర్యాదులు అందితే సమగ్ర విచారణ చేపట్టి, అనర్హులకు కేటాయించిన ఇళ్లను రద్దు చేయడంతో పాటు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రజలు అధికారులకు సహకరించి, నిజమైన అర్హులకు ఇళ్లు దక్కేలా చూడాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే నేరుగా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.



## కారేపల్లి షాదీ ఖానా అధ్యక్షులుగా ఎండీ. యాకూబ్ అలీ

- **ఉత్తర్వులు అందజేసిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాంబాబు**

**కారేపల్లి, మహా:** కారేపల్లి షాదీఖానా నూతన కమిటీని సోమవారం ప్రకటించారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సిఫార్సు తో ప్రభుత్వం షాదిఖాన కమిటీ అధ్యక్షులుగా ఎండి యాకూబ్ అలీ నియామకం జరిగింది. దీనికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోటకూర రాంబాబు చేతుల మీదుగా ఎండి.యాకూబ్ అలీకి అందజేశారు. ఉపాధ్యక్షులుగాబ షేక్ మజీద్ పాషా (షేర్), కార్యదర్శిగా ఎండీ సల్మా, సభ్యులుగా షేక్ యాకుబ్ పాషా, షేక్ ఖదీర్ లను నియమించారు. అనంతరం నూతన కమిటీ నియామక పత్రాలను తహసీల్దార్, ఎంపీడీవోలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ), మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్, మాజీ మండల కో ఆప్షన్ ఎండీ హనీఫ్, తదితరులు పాల్గొన్నారు..







## కళ్యాణ వేడుకలలో కంది శ్రీనన్న

ఆదిలాబాద్ మహా : ఆదిలాబాద్ పట్టణంలో ఆదివారం జరిగిన పలు శుభకార్యాలకు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. చిల్కూరి లక్ష్మి గార్డెన్ సాత్విక రంజిత్ రెడ్డి, తనీషా గార్డెన్ లో అమృత ,అరవింద్ కుమార్ , పి ఎస్ గార్డెన్ లో మేఘన హరీష్ , బాలాజీ గార్డెన్ లో ప్రియాంక యోగేష్ ,గాయత్రి గార్డెన్ లో లాస్య హరీష్, వి ఎన్ ఆర్ గార్డెన్ లో సమన్విత రామకృష్ణ రెడ్డి వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి పెళ్లి కానుకలు బహుకరించారు.అలాగేజైనథ్ మండలం నిరాల త్రినేత్ర గార్డెన్ లో రాణి దినేష్ ల నిశ్చితార్థ వేడుకలకు కూడా హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించి కానుకను బహుకరించారు.



# 22A భూములలో బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు!

- దళారుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**జిల్లాలో 22A జాబితాలో ఉన్న భూములు, భూ భారతి రికార్డులకు సంబంధించిన భూముల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కొంతమంది మధ్యవర్తులు, బ్రోకర్లు భూముల రికార్డులను సరిచేస్తామని, 22A జాబితా నుంచి భూములను తొలగిస్తామని, భూ భారతి ద్వారా భూమిపై హక్కులు కల్పిస్తామని చెబుతూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందుతోందన్నారు. ఇలాంటి వ్యక్తుల మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆయన స్పష్టం చేశారు. భూమిని కొనుగోలు చేసే ముందు లేదా భూమికి సంబంధించిన ఏదైనా లావాదేవీ నిర్వహించే ముందు సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి సర్వే నంబర్, భూమి స్థితి, 22A జాబితాలోని వివరాలు, భూ భారతి రికార్డులు, ఇతర చట్టపరమైన అంశాలను అధికారికంగా నిర్ధారించుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేయిస్తామని చెప్పే మధ్యవర్తులు, బ్రోకర్లను నమ్మి ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. భూములకు సంబంధించిన సమస్యలు లేదా అనుమానాలు ఉన్నట్లయితే సంబంధిత తహసీల్దార్ కార్యాలయం లేదా అధికారిక రెవెన్యూ కార్యాలయాలను సంప్రదించి వివరాలు, స్పష్టత పొందాలని సూచించారు. ప్రజలు భూములకు సంబంధించిన వ్యవహారాల్లో అధికారిక విధానాలను మాత్రమే అనుసరించాలని, మధ్యవర్తులు లేదా బ్రోకర్ల ద్వారా జరిగే అనధికారిక లావాదేవీలకు దూరంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి కోరారు.

# కేసులకు భయపడేది లేదు.. ప్రజల పక్షాన పోరాటం ఆపేది లేదు..

- తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు..
- రేవంత్ సర్కార్‌పై రేగా కాంతారావు ఫైర్
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల జోలికొస్తే ఊరుకోం
- ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- దమ్ముంటే అంబేద్కర్ సెంటర్‌లో బహిరంగ చర్చకు సిద్ధం
- దమ్ముంటే చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే రేగా సవాల్
- రేగాపై కేసు కొట్టివేతతో బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు



**మణుగూరు, మహా :** కేసులకు భయపడేది లేదు.. ప్రజల పక్షాన పోరాటం ఆపేది లేదు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే నాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదు. రేవంత్ సర్కార్ చేస్తున్న తాటాకు చప్పుళ్లకు బెదిరే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసే ఆలోచనలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మణుగూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. రేగా కాంతారావుపై నమోదైన కేసును కోర్టు కొట్టివేయడాన్ని స్వాగతిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం తెలంగాణ తల్లి, కొమరం భీమ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన పినపాక నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో రేగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రశ్నిస్తున్న వారిని అణచివేయాలనే ఉద్దేశంతోనే తనపై వరుసగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఎక్కడ నిరసన జరిగినా దానిని తనకు ముడిపెట్టడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో తన వాహనంపై దాడి జరిగినప్పుడు సైతం తానే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు.

**తప్పుడు ప్రచారాలతో అడ్డుకోలేరు.**

తనపై తప్పుడు ప్రచారం చేయించేందుకు కొందరు నాయకులు పత్రికల్లో కథనాలు రాయించేందుకు ప్రయత్నిస్తున్నారని రేగా ఆరోపించారు. తాను పదవిలో ఉన్న సమయంలో ఎవరి వద్ద నుంచి అన్యాయంగా, అక్రమంగా ఏమీ తీసుకోలేదని, అక్రమ ఆస్తులు కూడబెట్టలేదని స్పష్టం చేశారు. తన పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తులపైనా వివాదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నా ఆస్తులపై పూర్తి స్థాయి విచారణ జరిపించండి. అక్రమంగా సంపాదించినట్లు తేలితే ప్రజల ముందు సమాధానం చెప్పడానికి సిద్ధం అని సవాల్ విసిరారు. గిరిజనుల నుంచి కౌలుకు తీసుకున్న భూములకు సంబంధించిన సొమ్మును వారికి చెల్లించానని చెప్పారు. పోడు భూముల కోసం తాను చేస్తున్న పోరాటాన్ని అడ్డుకునేందుకే తనకు వేలాది ఎకరాల అటవీ భూములు ఉన్నాయంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

**నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా.**

తనపై ప్రస్తుత ఎమ్మెల్యేతో పాటు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు చేస్తున్న ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని రేగా కాంతారావు సవాల్ విసిరారు. "దమ్ముంటే మణుగూరు అంబేద్కర్ సెంటర్‌కు రండి. ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు నేను సిద్ధం. ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా" అని ప్రకటించారు. తనపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేసేందుకు ప్రయత్నించినా చివరకు న్యాయమే గెలిచిందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పేద కుటుంబాలకు అండగా నిలిచే పథకాలను కొనసాగించాల్సిందేనని డిమాండ్ చేశారు. వాటిని ఎత్తివేసే ప్రయత్నం చేస్తే ప్రజల పక్షాన పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని రేగా అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఎన్నింటిని అమలు చేశారో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చివరి వరకు పోరాడుతానని, ఎన్ని కేసులు పెట్టినా తన గొంతును అణచలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల-పట్టణ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా:**ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లాలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కలెక్టర్ గారిని కంది శ్రీనివాస రెడ్డి అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత, కళ్యాణమస్తు-షాదీ ముబారక్ వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పై ప్రత్యేకంగా చర్చిస్తూ, ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఇల్లు లేని అర్హులైన పేద కుటుంబాలందరినీ గుర్తించి, వారికి విడతల వారీగా ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఆదిలాబాద్ నియోజకవర్గంలో సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఒక్కటీ ఉండకూడదనేది ప్రభుత్వ లక్ష్యమని కంది శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా రైతులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలు, యువత మరియు వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తానని కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు.

# ప్రజాజీవనశైలికి జానపద కళలే సజీవ సాక్ష్యాలు

- తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంగ శ్రీనివాస్ గౌడ్



**బెల్లంపల్లి ,మహా**: తెలంగాణ రాష్ట్ర ప్రజల జీవన విధానాన్ని , జీవనశైలికి అనుసంధానమైన జానపద కళలే సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంగా శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. సోమవారం నాడు బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి కళావేదిక భవన్లో ఏర్పాటు చేసిన ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జానపద కళాకారులు పలు ప్రదర్శనలు ప్రదర్శించి పలువురిని ఆకట్టుకున్నారు .ఈ సందర్భంగా గుస్సాడీ, చిందు యక్షగానం ,వీధి భాగవతం, కోలాటం, బైండ్ల డప్పులు ,సన్నాయి, బోనాలు ,ఒగ్గు కథ ,భజన వంటి అనేక కళారూపాలు పలువురిని అలరింపజేశాయి .ఈ కార్యక్రమంలో 350 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో పలువురు మన్ననలను అందుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జానపద కళలను, జానపద వృత్తి కళారూపాలను సజీవంగా ఉంచాలని సదుద్దేశంతో జానపద వృత్తి కళాకారులను బ్రతికించాలని రాష్ట్ర జానపద కళాకారుల సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు .ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్‌బాబు పాల్గొని మాట్లాడుతూ జానపద కళాకారులకు కళలకు అండగా నిలుస్తుందని, జానపద కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి హనుమాన్ల మధు, మంచిర్యాల జిల్లా జానపద కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు మిట్ట లక్ష్మణ్ పటేల్, జిల్లా అధ్యక్షులు చొప్పదండి కిషన్ ప్రధాన కార్యదర్శి బబ్బెర రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికిరణ్ ,మహిళా విభాగం అధ్యక్షురాలు దుర్గం లక్ష్మి, ఆదిలాబాద్ జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు మిట్ట రవి ,కొమరం భీం జిల్లా జానపద కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు రాజబాబు తో పాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు.



# సేవా కార్యక్రమాలతో రవీందర్‌నాథ్ గుప్తా జన్మదిన వేడుకలు

**కుషాయిగూడ, మహా** : లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కుషాయిగూడ ఆధ్వర్యంలో రవీందర్‌నాథ్ గుప్తా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కీసర మండలం హరిదాస్‌పల్లి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర వేద పాఠశాలలో విద్యార్థులకు నెలవారీ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కాప్రా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు రక్త నిర్ధారణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమాలకు జిల్లా గవర్నర్ అశోక్‌కుమార్ స్వైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర వేద పాఠశాల అందిస్తున్న సేవలను అభినందించారు. సనాతన ధర్మ పరిరక్షణ, ప్రచారం కోసం సీతారామ శర్మ చేస్తున్న సేవలను ప్రశంసించారు. తన పదవీకాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమాల్లో క్లబ్ అధ్యక్షుడు చ. తారకేష్, చంద్రబాబు, జి. రమేష్, వాసి వెంకటేశ్వర్లు, పెద్ది శ్రీనివాస్, రామచందర్ రాజు, చందర్ శేఖర్, ఎం.ఎస్. పిల్లి, రవిశంకర్ రాజు, సిద్ధిపేట శ్రీనివాస్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వైద్యం, విద్య, సామాజిక సంక్షేమం, నిరుపేదలకు సహాయం వంటి రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.



# భరతనాట్యంలో విశేషప్రతిభ కనబరిచిన కళాకారిణీలు

శ్రీ చక్రి పద్మ పురస్కారం అందుకున్న చిన్నారులు

**బెల్లంపల్లి ,మహా:** భరతనాట్యంలో విశేష ప్రతిభ కనబరిచిన చిన్నారి కళాకారిణీలు బింగి ధన్వి శ్రీ , బింగి శ్రీ క్షిత లు ఇరువురు సోదరీమణులు శ్రీ చక్రి పద్మ పురస్కారాన్ని అందుకున్నారు .బెల్లంపల్లి పట్టణంలోని బింగి నరేష్ సుస్మితల దంపతుల కుమార్తెలు ఇరువురు బింగి ధన్వి శ్రీ, బింగి శ్రీక్షిత లు భువనగిరి జిల్లా శ్రీ స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్య పోటీల్లో తమ భరతనాట్యాన్ని అరంగేట్రం చేసి పలువురిని ఆకట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా స్నేహ ఫౌండేషన్ నిర్వాహకులు చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శనకు శ్రీ చక్రి పద్మ పురస్కారాన్ని అందజేశారు. గతంలోనూ హైదరాబాదులోని రవీంద్ర భారతిలో ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శనలోనూ తమ నాట్య ప్రదర్శనను ప్రదర్శించి పలువురి ప్రశంసలను అందుకున్నారు. శ్రీ చక్రి పద్మ పురస్కారం రావడం పట్ల కుటుంబ సభ్యుల తో పాటు పట్టణవాసులు పలువురు హర్షం వ్యక్తం చేశారు.



# సండ్రోనిపల్లె, దుబ్బపల్లెలో గుంతలు పూడ్చండి

- భాజపా మందమర్రి మండల ప్రధాన కార్యదర్శి వంజరీ వెంకటేష్

**మందమర్రి, మహా**: మందమర్రి మండలం సండ్రోనిపల్లె, దుబ్బపల్లెలో వర్షాకాలంలో ఏర్పడిన గుంతలను పూడ్చండని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భాజపా మందమర్రి మండల ప్రధాన కార్యదర్శి వంజరీ వెంకటేష్ ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సండ్రోనిపల్లి గ్రామం దాటిన తర్వాత సారంగపల్లి (దుబ్బపల్లెగ్రామ) మూలమలుపు దగ్గర రోడ్డుపై వర్షం నీరు నిలిచి గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. అలాగే ఆదిల్పేట్ గ్రామం నుండి పొన్నారం గ్రామం వయా రసూల్ పల్లె, జైపూర్ ప్రధాన రహదారిలో బురద మట్టి, నీటి నిల్వలు మరియు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు చెట్ల వల్ల రోడ్డు ఇరుకుగా మారి జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన వినతిపత్రంలో కోరారు. ఈ విషయంలో సంబంధిత ప్రభుత్వాధికారులు చొరవ తీసుకొని తక్షణ మరమ్మత చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ప్రజావాణిలో ఆడిగోపుల్ల మురళీ, కాల్వల శ్రీనివాస్ పాల్గొన్నారు.



# ఈనెల 27న ఉద్యోగుల మహా ధర్నా!

- ఉద్యోగుల మహాధర్నాకు అనుమతి ఇవ్వండి..
- టీజీజేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్
- జిల్లా అదనపు కలెక్టర్, జెయింట్ సీపీకి వినతి పత్రం సమర్పణ

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 24 మహా**: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 27న తలపెట్టనున్న మహా ధర్నా కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలంటూ, రంగారెడ్డి జిల్లా అదనపు జిల్లా కలెక్టర్ కిరణ్మయి, ఫ్యూచర్ సిటీ జెయింట్ కమిషనర్ హరిచందనదీప్తిలను కలసిన, టీజీజేఏసీ రంగారెడ్డి జిల్లా చైర్మన్ ఊటు యశ్వంత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఊటు యశ్వంత్ మాట్లాడుతూ... ఉద్యోగుల సమస్యలను జిల్లా కలెక్టర్ కి తెలియజేయడం జరిగింది. టీజీజేఏసీ రాష్ట్ర చైర్మన్ శ్రీమారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు, కార్యవర్గం తీసుకున్న నిర్ణయం మేరకు రంగారెడ్డి జిల్లాలో అన్ని వర్గాల ఉద్యోగుల ఆభీష్టం మేరకు ఈనెల 27న మహా ధర్నా కార్యక్రమం శాంతియుతంగా అన్ని భాగస్వామ్య సంఘాల ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఉన్న ఉద్యోగులు పెద్దఎత్తున సమస్యల పరిష్కారం కొరకు కొంగరకాలన్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీజేఏసీ నాయకులు శ్రీనివాసరావు, రంగయ్య, ఆనంద్ సింగ్, గోపాల్ నాయక్, వాణి శ్రీదేవి, అన్నపూర్ణ, తేజ, గౌస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ!

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**:సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 53 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డితో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

- 70.19 గ్రా. బంగారు అభరణాలు, 527.9 గ్రా. వెండి, నగదు స్వాధీనం
- పోలీసులను అభినందించిన డిసిపి ధార కవిత

**హనుమకొండ మహా ;** వరంగల్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను మిల్స్ కాలనీ తో కలిసి సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా సొమవారం అరెస్టు చేసారు. నిందితుడి నుండి సుమారు 12 లక్షల విలువ గల 70.19 గ్రాముల బంగారు అభరణాలు, 527.9గ్రాముల వెండి, 29,875/` రూపాయలు నగదు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**కేసు వివరాల్లోకెళ్తే..**
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల జరిగిన వరుస దోంగతనాలకు సంబంధించి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు కాగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, ఐపిఎస్ అదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను నియమించడం జరిగింది. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ప్రత్యేక దృష్టి సారించి నేర విచారణ చేయడం జరిగింది. గత కాలంగా జరిగిన చోరీలను విశ్లేషణ చేయగా సోమవారం ఉదయం ఒక అనుమానిత వ్యక్తిని అదుపులో తీసుకోని విచారించగా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలకు సంబందించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఆశిష్ శ్రీనివాస్ రెడ్డిమల్ల,(27) నివాసం పెద్దపల్లి, తెలంగాణ రాష్ట్రం, ప్రస్తుతం మహరాష్ట్ర లోని చంద్రపూర్‌లో నివాసం వుంటున్న నిందితుడు సులభంగా డబ్బు సంపాదించాని తాళం వేసి వున్న ఇండ్లల్లో చోరీలకు పాల్పడినట్లుగా ప్రాధమిక విచారణలో వెల్లడైంది. ఈ రోజు ఉదయం మీల్స్ కాలనీ పోలీసులు వరంగల్ రైల్వే స్టేషన్‌లో అరెస్టు నిందితుడు చోరీ సోత్తును స్వాధీనం చేసుకోని విచారించగా నిందితుడు పగటి సమాయల్లో తాళం వేసి వున్న ఇండ్లను గుర్తించి రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పదేవాడు. ఇదే రీతిలో నిందితుడు 2024, 2025 మహారాష్ట్రలో మొత్తం నాలుగు చోరీలకు పాల్పడటంతో నిందితుడిని మహరాష్ట్ర పోలీసులు అరెస్టు చేసి జైలు తరలించగా, బెయిల్ పై జైలు విడుదలయినాడు.నిందితుడు జైలు నుండి విడుదల ఆయిన అతనిలో ఎలాంటి మార్పురాకపోవడం మరో మారు నిందితుడు ఈ సంవత్సరం మీల్స్ కాలనీ పరిధిలోని శివనగర్, ఎస్.ఆర్.ఆర్ నగర్ ప్రాంతంలో తాళం వేసి వున్న ఇండ్లల్లో వరుస చోరీలకు పాల్పడినట్లుగా నిందితుడు విచారణలో వెల్లడించాడు. చోరీకి పాల్పడిన అంతర్ రాష్ట్ర నిందితుడి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిసిఎస్ ఇన్స్ స్పెక్టర్ రామకృష్ణ, మీల్స్‌కాలనీ ఇన్స్ స్పెక్టర్ స్వామి, ఎస్. ఐ మహేష్, ఏ.ఏ.ఓ సల్మాన్ పాషా తో పాటు ప్రింగ్ సిసి ఎస్. మీల్స్ కాలనీ సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.




# ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా గణేశ్ విగ్రహాల విక్రయాలు నిర్వహించాలి

- ల్దియా కమిషనర్ టి వెంకన్న
- గణేష్ విగ్రహాల తయారీదారులు,సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం
- ప్రధాన రహదారులు, డ్రైనేజీల పై విగ్రహాల విక్రయాలు చేపట్ట రాదు

**వరంగల్, కార్పొరేషన్ మహా ;** రాబోయే గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో నగరంలో గణేశ్ విగ్రహాల విక్రయాలు ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గణేశ్ విగ్రహాల తయారీదారులు, విక్రయదారులు సహకరించాలని బల్దియా కమిషనర్ టి. వెంకన్న సూచించారు.సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో బల్దియా టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు, గణేశ్ విగ్రహాల తయారీదారులు, విక్రయదారులతో కమిషనర్ వెంకన్న సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గణేశ్ విగ్రహాల విక్రయాల కారణంగా ప్రధాన రహదారుల పై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రధాన రహదారులు, డ్రైనేజీలపై విగ్రహాలను ఏర్పాటు చేసి విక్రయించరాదని స్పష్టం చేశారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా గుర్తించిన అనువైన ప్రాంతాల్లో మాత్రమే విగ్రహాలను ఏర్పాటు చేసి విక్రయించాలని సూచించారు.గణేశ్ విగ్రహాల విక్రయాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ కోరారు. విక్రయదారులు, తయారీదారులు అధికారులు సూచించే నిబంధనలను పాటిస్తూ సహకరించాలని తెలిపారు.

**గణేశ్ విగ్రహాల విక్రయాలకు గుర్తించిన ప్రదేశాలు**
నగరంలో గణేశ్ విగ్రహాల విక్రయాలకు అనువైన ప్రాంతాలను అధికారులు గుర్తించినట్లు కమిషనర్ వెల్లడించారు. హన్మకొండలోని పద్మాక్షి మైదానం, హయగ్రీవాచారి గ్రౌండ్స్, ఉర్సు, ఓసిటీ మైదానం, ఖిలా వరంగల్‌లోని మైదానాలు, అలాగే తోట మైదానాలను అవసరానుసారం వినియోగించుకునేలా గుర్తించినట్లు తెలిపారు.గణేశ్ విగ్రహాల విక్రయదారుల సంఘం ప్రతినిధుల సూచనలు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని గుర్తించిన ప్రాంతాల్లో అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

**ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ**
గణేశ్ విగ్రహాల విక్రయాలకు ఎంపిక చేసిన ప్రాంతాల్లో విక్రయదారులకు అనుకూలంగా అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. విక్రయాలు క్రమబద్ధంగా, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా జరిగేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు, విక్రయదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన పోలీసు 3బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు.ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ విక్రయదారులు తమ కార్యకలాపాలను నిర్వహించాలని, తద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ టి. వెంకన్న కోరారు.ఈ సమావేశంలో బల్దియా సూపరిండెంట్ ఇంజనీర్ రాజ్ కుమార్,ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్,టౌన్ ప్లానింగ్ ఏ సి పి ఖలీల్ ట్రాఫిక్ సీఐలు సుజాత, వెంకన్న, రామకృష్ణ, లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్ఐలు టౌన్ ప్లానింగ్ అధికారులు, గణేశ్ విగ్రహాల తయారీదారులు, విక్రయదారుల సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# భోజన తయారీ, వడ్డింపులో పరిశుభ్రత తప్పనిసరి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించిన కలెక్టర్

**వరంగల్, మట్టేవాడ మహా;** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం వరంగల్ నగరంలోని మట్టేవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భోజన తయారీ, వడ్డింపు ప్రక్రియలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం విషయంలో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు.




# విద్యార్థుల భద్రతకు ప్రతిష్ట ట్రాఫిక్ చర్యలు

- ట్రాఫిక్ నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి
- పాఠశాల సమయాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తప్పని సరి



**హనుమకొండ, మహా :** వరంగల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళ్లే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, బల్దియా కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.ఈ మేరకు సోమవారం వరంగల్ పబ్లిక్ స్కూల్ నుంచి రాజ్ హోటల్ వరకు పోలీస్, బల్దియా, రోడ్లు-భవనాల శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి ట్రాఫిక్ పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా పాఠశాల ప్రారంభం, ముగింపు సమయాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ట్రాఫిక్ భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా, వాహనాల వేగాన్ని నియంత్రించేలా అవసరమైన చర్యలు చేపట్టడం, ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా క్రమబద్ధీకరించడం, అనవసరమైన క్రాస్ మూమెంట్స్‌ను నియంత్రించడం వంటి అంశాలను అధికారులు పరిశీలించారు.అలాగే రహదారి మధ్యలో ఉన్న డివైడర్లను పరిశీలించి, విద్యార్థులు, పాదచారులు అనధికారికంగా రోడ్డు దాటే అవకాశం ఉన్న ప్రాంతాల్లో డివైడర్ ఓపెనింగ్స్‌ను మూసివేయడం, అవసరమైన చోట్ల మాత్రమే ఓపెనింగ్స్ ఉంచడం వంటి చర్యలపై చర్చించారు. పాఠశాల పరిసరాల్లో వాహనాల పార్కింగ్, పాఠశాల బస్సుల రాకపోకలు, పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను కూడా పరిశీలించారు.విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యంగా, పాఠశాల పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలను సమన్వయంతో చేపట్టాలని అధికారులు సూచించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పాఠశాల సమయాల్లో ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ పెంచడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో బ్యారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, డీసీపీ సెంట్రల్ జోన్ ధార కవిత, ఏసీపీ ట్రాఫిక్ సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి, జిడబ్ల్యూఎంసి ఎస్‌ఈ రాజ్‌కుమార్, బల్దియా ఇంజనీరింగ్ అధికారులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

**ప్రజావాణిలో 72 దరఖాస్తుల స్వీకరణ**
**బల్దియా కమిషనర్ టి. వెంకన్న**



**వరంగల్, కార్పొరేషన్ మహా :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధేశిత గడువులోగా పరిష్కరించాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు.
సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 72 దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం గత వారం ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కార స్థితిగతులను విభాగాల వారీగా సమీక్షించారు.
ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల్లో
టౌన్ ప్లానింగ్..30, ఇంజినీరింగ్.. 15, హెల్త్ అండ్ శానిటేషన్... 05, రెవెన్యూ......14, నీటి సరఫరా.. 07, హార్టికల్చర్.... 01
మొత్తం.. 72 గా అధికారులు వెల్లడించారు. అనంతరం అధికారులతో కమిషనర్, పన్నుల వసూళ్లపై సమీక్షిస్తూ పన్నుల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్దేశించిన పన్ను వసూలు లక్ష్యాలను ఎప్పటికప్పుడు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ప్రతి మూడేళ్లకు సెప్టిక్ ట్యాంకుల శుభ్రత**
నగర పారిశుద్ధ్య నిర్వహణలో అనంతరం నిర్వహించిన సమావేశంలోభాగంగా సెప్టిక్ ట్యాంకుల శుభ్రతపై అధికారులు, ప్రజల్లో అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. నగరంలోని అమ్మవారిపేటలో ఇటీవల 150కేఎల్‌డీ సామర్థ్యంతో సెప్టిక్ ట్యాంక్ మల వ్యర్థాల శుద్ధి ప్లాంట్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు.నిబంధనల ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయించుకోవాలని, నగరంలో నివసించే బల్దియా అధికారులు తమ గృహాల్లోని సెప్టిక్ ట్యాంకులను కూడా నిర్ణీత వ్యవధిలో శుభ్రం చేయించుకోవాలని సూచించారు. ఇది కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణతో పాటు నగర పారిశుద్ధ్య నిర్వహణకు దోహదపడుతుందని కమీషనర్ పేర్కొన్నారు. సెప్టిక్ ట్యాంకుల నుంచి మల వ్యర్థాల సేకరణ కోసం బల్దియా 29 సెప్టిక్ ట్యాంకర్ వాహనాలకు అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. అధికారులు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అద్దె ఇళ్లలో నివసించే అధికారులు సంబంధిత ఇంటి యజమానులు కూడా నిర్ణీత వ్యవధిలో సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయించుకునేలా ప్రోత్సహించాలని కమిషనర్ కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్ బాబు, పన్నుల అధికారి రామకృష్ణ అన్ని విభాగాల అధికారులు తదితర అధికారులు పాల్గొన్నారు.



# శంషాబాద్ ప్రజావాణిలో ఆరు అర్జీలు

**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ మండల స్థాయిలో చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం వివిధ గ్రామాల నుంచి ఆరు అర్జీలు వచ్చాయని మండల ఎంపీడీవో నోడల్ అధికారి జీ మున్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిషేధిత జాబితా నుంచి తన భూమి తొలగించాలని పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, డిడి కట్టిన పెద్ద షాపూర్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని, సానిటేషన్ సమస్య పరిష్కరించాలని , పెద్ద షాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టా స్థలాన్ని కబ్జా చెర నుంచి కాపాడాలని కోరుతూ ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వినతి పత్రాలను సంబంధిత అధికారులకు చేరవేసి 30 రోజులలో సమస్య పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకోవాలని సూచించడం జరుగుతుందన్నారు. స్థానిక అధికారులు సమస్యను పరిష్కరించకుంటే ఆ పైన ఉన్న అధికారులకు అర్జీ పెట్టుకున్న దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా పంపడం జరుగుతుందని తెలిపారు. జిహెచ్ఎంసి శంషాబాద్ సర్కిల్ సంబంధించిన ఆర్జీలను అక్కడ స్థానిక అధికారులకు ఆన్లైన్ ద్వారా పంపుతామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండల కార్యాలయంలో సమస్యలపై వినతి పత్రాలు ఫిర్యాదులు స్వీకరిస్తుందన్నారు. ఇచ్చిన ఫిర్యాదులను వినతి పత్రాలను క్రమం తప్పకుండా రికార్డు చేసి సంబంధిత అధికారులకు చేరవేస్తామని తెలిపారు.

**చేయూత పెన్షన్లకు ఈనెల 31 వరకు గడువు...**
చేయూత పెన్షన్లకు మండల ప్రజల నుంచి వచ్చిన 246 దరఖాస్తులు ఆన్లైన్ చేయడం జరిగిందన్నారు. ఈనెల 31వ తేదీ వరకు అర్హులైన వ్యక్తులు సంబంధిత ధ్రువపత్రాలతో పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు ఫారం నింపి సర్టిఫికెట్లను జత చేసి ఇవ్వాలని కోరారు.

# హామీలు నెరవేర్చలేదు

- సెప్టెంబర్ 5న ఢిల్లీలో భారీ ర్యాలీ
- అత్యవసర సమావేశం అనంతరం సీజేపీ పిలుపు

**న్యూఢిల్లీ, మహా :** ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సెప్టెంబర్ 5న ఢిల్లీలో భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించనుంది. ఇండియా గేట్ నుంచి నూతన ఢిల్లీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు మార్చ్ చేపట్టనున్నట్లు ప్రకటించింది.జూలై 25న ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై సీజేపీ జాతీయ వర్కింగ్ కమిటీ సమీక్షించింది. విద్యార్థులు, ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల రద్దు, బాధిత కుటుంబాలకు పరిహారం విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గిందని ఆరోపించింది. దీంతో మళ్లీ ఆందోళనకు దిగుతున్నట్లు తెలిపింది.సెప్టెంబర్ 5న విద్యార్థులు, యువత, యువజన సంఘాలు పెద్ద సంఖ్యలో ఇండియా గేట్‌కు తరలివచ్చి శాంతియుత ర్యాలీలో పాల్గొనాలని సీజేపీ పిలుపునిచ్చింది. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది.




# మన్నెగూడ చెన్నపట్నం ఫిల్టర్ కాఫీలో బొద్దింక ప్రత్యక్షం!

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 24 మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధి మన్నెగూడలోని చెన్నపట్నం ఫిల్టర్ కాఫీ సెంటర్‌లో, కాఫీలో బొద్దింక ప్రత్యక్షం కావడం తీవ్ర కలకలం రేపింది. ఆదిభట్ల సర్కిల్ పరిధి మన్నెగూడలోని చెన్నపట్నం హోటల్ కు వచ్చిన కస్టమర్ బ్లాక్ కాఫీ ఆర్డర్ చేయగా, కాఫీలో బొద్దింక రావడంతో కస్టమర్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. దీంతో హోటల్ యాజమాన్యాన్ని నిలదీశారు. హోటల్లో టీ, కాఫీలను విక్రయిస్తూ వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని కస్టమర్లు మండిపడుతున్నారు. కాఫీలోనే బొద్దింక కనిపించడం హోటల్‌లో పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో స్పష్టం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని హోటల్ యాజమాన్యంపై తీవ్రస్థాయిలో వినియోగదారులు మండిపడ్డారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి హోటల్‌ను తనిఖీ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

# మహిళ అదృశ్యం.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు!



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 24 మహా:** యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. యాచారం మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన దారా మంజుల (33) అనే మహిళ అదృశ్యమైనట్లు యాచారం పోలీసులు వెల్లడించారు. మంజుల తల్లి దారా రామచంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన మంజుల ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. అదృశ్యమైన మహిళకు సంబంధించిన ఏదైనా సమాచారం లభించినా వెంటనే పోలీసులకు తెలియజేసి, దర్యాప్తుకు సహకరించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# పోర్షే ఐటీ విభాగం టీసీఎస్ చేతికి

- రూ.2,800 కోట్లకు ఎంహెచ్‌పీ కొనుగోలు
- ఐదేళ్లలో రూ.10,900 కోట్ల సేవల ఒప్పందం
- ఏఐ, వాహన సాఫ్ట్‌వేర్ రంగంలో భారీ అడుగు

**ముంబయి, మహా :** ప్రపంచ కార్ల దిగ్గజం పోర్షేకు చెందిన సాంకేతిక, నిర్వహణ సలహా విభాగం ఎంహెచ్‌పీని భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కొనుగోలు చేయనుంది. సుమారు 320 మిలియన్ యూరోలు (రూ.2,800 కోట్లు) విలువైన ఈ ఒప్పందంతోపాటు పోర్షే, ఎంహెచ్‌పీ నుంచి ఐదేళ్లలో 1.25 బిలియన్ యూరోలు (రూ.10,900 కోట్లు) విలువైన సేవల ఒప్పందాన్ని కూడా టీసీఎస్ దక్కించుకుంది.

**వాహనాల్లో సాఫ్ట్‌వేర్‌దే కీలక పాత్ర**
ఎంహెచ్‌పీకి ఆటోమొబైల్ తయారీ, ఇంజినీరింగ్, వాహన సాఫ్ట్‌వేర్, డిజిటల్ సేవల్లో విస్తృత అనుభవం ఉంది. సంస్థను టీసీఎస్ కొనుగోలు చేయడంతో ప్రపంచ కార్ల తయారీ సంస్థలకు అధునాతన సాంకేతిక సేవలు అందించే అవకాశం మరింత పెరగనుంది. ప్రస్తుతం వాహనాల్లో ఇంజిన్ కంటే సాఫ్ట్‌వేర్, కృత్రిమ మేధ, భద్రత, అనుసంధానిత సాంకేతికత, స్వయంచాలక నడక వంటి అంశాలే కీలకంగా మారుతున్నాయి.

**ఏఐ వైపు ఆటో రంగం**
వాహనాల రూపకల్పన, తయారీ, సరఫరా వ్యవస్థ, వినియోగదారుల సేవల్లో కృత్రిమ మేధను విస్తృతంగా వినియోగించేందుకు టీసీఎస్, పోర్షే కలిసి పనిచేయనున్నాయి. సాఫ్ట్‌వేర్ ఆధారిత వాహనాల అభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యం పెంపు, వినియోగదారుల అవసరాలను ముందుగానే గుర్తించడం వంటి రంగాల్లో ఈ భాగస్వామ్యం ఉపయోగపడనుంది.

**భారత టెక్ రంగానికి గుర్తింపు**
పోర్షే వంటి అంతర్జాతీయ కార్ల సంస్థతో వ్యూహాత్మక భాగస్వామ్యం టీసీఎస్‌కు యూరప్ ఆటోమొబైల్ మార్కెట్లో మరింత బలమైన స్థానం కల్పించనుంది. సంస్థ కొనుగోలుతోపాటు భారీ దీర్ఘకాలిక సేవల ఒప్పందం దక్కడం టీసీఎస్ భవిష్యత్ వ్యాపారానికి మరింత ఊతమివ్వనుంది.
విద్యుత్ వాహనాలు, ఏఐ, స్వయంచాలక నడక, అనుసంధానిత వాహనాల వైపు ప్రపంచ ఆటో రంగం వేగంగా అడుగులు వేస్తున్న సమయంలో ఈ ఒప్పందం భారత సాంకేతిక సంస్థకు కీలక మైలురాయిగా నిలవనుంది.



# విజయ్ దేవరకొండకు 'రణబలి'తో బిగ్ హిట్ వస్తుందా?

టాలీవుడ్‌లో కొంతకాలంగా సరైన కమర్షియల్ సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న హీరోలకు వరుసగా మంచి ఫలితాలు వస్తున్నాయి. వరుణ్ తేజ్, అఖిల్, రవితేజ వంటి హీరోలు తమ సినిమాలతో మళ్లీ జోరు పెంచారు. దీంతో ఇప్పుడు అందరి దృష్టి విజయ్ దేవరకొండపై పడింది.'లైగర్' తర్వాత విజయ్‌కు ఆశించిన స్థాయిలో భారీ విజయం దక్కలేదు. 'ఖుషి' కొంత ఊరటనిచ్చినా పూర్తి స్థాయి కమ్‌బ్యాక్ ఇవ్వలేకపోయింది. 'ది ఫ్యామిలీ స్టార్', 'కింగ్‌డమ్' సినిమాలు కూడా ఆయన కోరుకున్న స్థాయిలో ఫలితాన్ని అందించలేదు. అయితే విజయ్ క్రేజ్ మాత్రం తగ్గలేదు. ఈసారి పోస్టర్లు, టీజర్ల హైప్‌ను దాటి థియేటర్లలో నిలిచే సాలిడ్ హిట్ అవసరం.ఆ అవకాశం 'రణబలి'తో దక్కుతుందనే అంచనాలు ఉన్నాయి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా 1854-1878 మధ్య బ్రిటిష్ పాలన నేపథ్యంలో సాగుతుంది. ఇందులో విజయ్ దేవరకొండ స్వాతంత్ర్య పోరాట యోధుడి పాత్రలో కనిపించనున్నాడు. హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తుండటం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. రష్మిక మందన్న జయమ్మ పాత్రలో కనిపించనుంది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత ఈ జోడీ మరోసారి తెరపై కనిపించనుండటంతో అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఇప్పటికే వీరి కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్ సినిమాకు అదనపు బలంగా మారుతోంది.సినిమా క్లైమాక్స్ కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని దర్శకుడు గతంలో వెల్లడించారు. విజయ్, ఆర్నాల్డ్ వోస్లూ మధ్య కీలక పోరాట సన్నివేశాలను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు సమాచారం. పీరియడ్ యాక్షన్‌తో పాటు కథలో మరో ఆసక్తికరమైన కోణం కూడా ఉంటుందని చిత్రంపై ప్రచారం జరుగుతోంది. సెప్టెంబర్ 11న 'రణబలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. వరుసగా ఇతర హీరోలు విజయాలు అందుకుంటున్న సమయంలో విజయ్‌కు కూడా ఈ సినిమా కీలకంగా మారింది. కొత్త కథ, పీరియడ్ బ్యాక్‌డ్రాప్, రష్మిక కాంబినేషన్, బలమైన విలన్ వంటి అంశాలు సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. మరి విజయ్ చాలా రోజులుగా ఎదురుచూస్తున్న సాలిడ్ కమర్షియల్ హిట్‌ను 'రణబలి' అందిస్తుందా అనేది విడుదల తర్వాతే తేలనుంది.



# నువేక్ష అందాల మెరుపులు

సినీ నటి నువేక్ష తాజాగా పంచుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయ చీరకట్టులో కనిపించిన ఆమె అందం, సింపుల్ లుక్‌తో అభిమానులను ఆకర్షిస్తోంది. మసక వెలుతురు, నీటి తీరాన్ని తలపించే ప్రశాంతమైన బ్యాక్‌డ్రాప్‌లో నువేక్ష ఫొటోషూట్ చేయించుకుంది. నారింజ రంగు చీరకు సున్నితమైన బంగారు అంచులు, అందమైన డిజైన్లు ఉండగా.. దానికి గులాబీ రంగు బ్లౌజ్‌ను జత చేసింది. చెవులకు జుంకాలు, చేతులకు గాజులు, నుదుట బొట్టు వంటి సంప్రదాయ ఆభరణాలతో లుక్‌ను మరింత అందంగా తీర్చిదిద్దుకుంది. మెడను సున్నితంగా తాకుతూ ప్రశాంతమైన చిరునవ్వుతో ఇచ్చిన పోజ్ ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

1999 ఆగస్టు 1న బెంగళూరులో జన్మించిన నువేక్ష అసలు పేరు నమ్రత దారేకర్. తొలుత మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె.. ఆ తర్వాత నటనపై దృష్టి సారించింది. తెలుగు చిత్రసీమలో 'ఇప్పుడు కాక ఇంకెప్పుడు' చిత్రంతో సినీ ప్రయాణాన్ని ప్రారంభించింది. ప్రారంభ దశలో కొన్ని సినిమాల్లో తన అసలు పేరుతోనూ కనిపించింది. ఆ తర్వాత 'హిట్: ది ఫస్ట్ కేస్'లో సప్న పాత్రతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. 'సెబాస్టియన్ పీసీ 524'లో కిరణ్ అబ్బవరం సరసన నటించడంతో పాటు 'అతిథి దేవోభవ' చిత్రంతోనూ గుర్తింపు తెచ్చుకుంది.

2024లో విడుదలైన 'రోటి కపడా రొమాన్స్' చిత్రంలో దివ్య పాత్రలో కనిపించింది. ప్రస్తుతం తెలుగు సినిమాల్లో ఎంపిక చేసిన పాత్రలతో తన కెరీర్‌ను కొనసాగిస్తున్న నువేక్ష.. సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో ఫొటోలు, అప్‌డేట్స్ పంచుకుంటోంది. తాజాగా సంప్రదాయ చీరలో కనిపించిన ఈ ఫొటోలు ఆమె సహజమైన అందం, సొగసైన లుక్‌ను మరోసారి హైలైట్ చేస్తున్నాయి. ప్రశాంతమైన చిరునవ్వు, సంప్రదాయ ఆభరణాలు, ఆకర్షణీయమైన చీరకట్టుతో నువేక్ష ఈ ఫొటోల్లో ప్రత్యేకంగా మెరిసింది.






# రవితేజను చూసి కంటతడి పెట్టిన మోక్ష

మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటోంది. సినిమా విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సక్సెస్ మీట్‌లో దర్శకుడు శివ నిర్వాణ పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు.కథ చర్చల దశలో ఉన్న సమయంలో రవితేజ కుమార్తె మోక్ష స్వయంగా దర్శకుడి కార్యాలయానికి వచ్చి కథ విన్నారని చెప్పారు. ఆధునిక ఆలోచనా విధానం ఉన్న మోక్ష కథను ఎలా స్వీకరిస్తారో మొదట ఆసక్తిగా అనిపించిందన్నారు. అయితే కథ వింటున్న సమయంలో ఆమె తన తండ్రినే ఆ పాత్రలో ఊహించుకున్నారని తెలిపారు.ముఖ్యంగా ద్వితీయార్థంలోని ఓ భావోద్వేగ సన్నివేశాన్ని వివరిస్తున్నప్పుడు మోక్ష తీవ్రంగా స్పందించారని శివ నిర్వాణ గుర్తుచేసుకున్నారు. భావోద్వేగానికి గురై కథను అక్కడే ఆపేయాలని కోరినట్లు చెప్పారు. థియేటర్‌లో ఆ సన్నివేశాన్ని తాను చూడలేనని ఆమె చెప్పినట్లు వెల్లడించారు. ఎడిటింగ్ దశలోనూ మోక్ష సినిమాను చూడలేదని, ఇటీవలే పూర్తిగా చూసినట్లు దర్శకుడు తెలిపారు.ఈ సినిమాలో హీరోయిజం కంటే పాత్రలోని సహజత్వానికి ప్రాధాన్యం ఇచ్చామని శివ నిర్వాణ చెప్పారు. ఇంటర్వెల్‌కు ముందు రవితేజ సాధారణ విలన్ చేతిలో దెబ్బలు తినే సన్నివేశాన్ని కూడా కథకు అవసరమని భావించి ఆయన అంగీకరించారని తెలిపారు. అయ్యప్ప స్వామి భిక్ష సన్నివేశాల కోసం షర్ట్ లేకుండా నటించేందుకు కూడా రవితేజ ఎలాంటి అభ్యంతరం చెప్పలేదన్నారు.కథ వింటున్న సమయంలోనే నిర్మాత నవీన్, రవితేజ మేనేజర్ శ్రీనివాసరాజు భావోద్వేగానికి గురయ్యారని దర్శకుడు తెలిపారు. సినిమాలోని బలమైన ఎమోషన్‌నే ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రధాన అంశంగా ఆయన పేర్కొన్నారు. అదే 'ఇరుముడి' విజయానికి కీలక కారణమైందని శివ నిర్వాణ అభిప్రాయపడ్డారు.

# కృతి సనన్ యాడ్‌పై నెటిజన్ల రియాక్షన్

బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన ఓ జ్యువెలరీ ప్రకటన ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. రక్షాబంధన్ నేపథ్యంలో రూపొందిన ఈ యాడ్‌లో కృతి ధరించిన ఇండోవెస్ట్రన్ దుస్తులపై కొందరు నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆమె ధరించిన బ్రాలెట్ స్టైల్ బ్లౌజ్, యాడ్‌లో రాఖీ వేడుకను చూపించిన తీరుపై విమర్శలు వస్తున్నాయి.ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ కోసం రూపొందించిన ఈ ప్రకటనలో కృతి తన సోదరుడికి రాఖీ కడుతున్నట్లు కనిపించారు. ఈ సందర్భంగా బ్రాలెట్ తరహా బ్లౌజ్, ష్రగ్, డ్రేప్డ్ స్కర్ట్‌తో కూడిన మోడ్రన్ లుక్‌లో ఆమె దర్శనమిచ్చారు. అదే దుస్తుల్లో ఓ కుక్కకు కూడా రాఖీ కట్టే సన్నివేశం ఉంది.రక్షాబంధన్ వంటి సంప్రదాయ పండుగకు సాధారణంగా భారతీయ వస్త్రధారణను అనుసరిస్తారని, ఈ యాడ్‌లో మాత్రం ఆధునిక ఫ్యాషన్‌ను ప్రాధాన్యంగా చూపించడంపై కొందరు నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అయితే మరోవైపు కృతికి అభిమానులు, ఆధునిక ఆలోచనలు కలిగిన నెటిజన్లు మద్దతుగా నిలుస్తున్నారు. పండుగలను ప్రస్తుత కాలానికి అనుగుణంగా కొత్తగా చూపించడంలో తప్పేమీ లేదని వారు అభిప్రాయపడుతున్నారు. దీంతో కృతి సనన్ జ్యువెలరీ యాడ్‌పై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# బుచ్చిబాబు నెక్స్ట్ హీరో ఎవరు?



'ఉప్పెన'తో దర్శకుడిగా బుచ్చిబాబు సానా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్న ఆయనకు, ఆ తర్వాతే రామ్ చరణ్ వంటి స్టార్ హీరోతో పనిచేసే అవకాశం వచ్చింది. దీంతో బుచ్చిబాబు స్థాయి కూడా ఒక్కసారిగా పెరిగింది. 'పెద్ది'ని పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించడంతో ఆయన తదుపరి సినిమా కూడా మరో స్టార్ హీరోతోనే ఉంటుందనే అంచనాలు ఏర్పడ్డాయి.అయితే 'పెద్ది'పై భారీ అంచనాలు ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితం రాలేదు. తెలుగు మార్కెట్‌లో కొంత ప్రభావం చూపించినా, పాన్ ఇండియా స్థాయిలో మాత్రం పెద్ద బ్రేక్ దక్కలేదు. సినిమా భారీ హిట్ అయి ఉంటే ఎన్టీఆర్, మహేష్ బాబు వంటి అగ్ర హీరోలతో పాటు ఇతర భాషల స్టార్ హీరోలను సంప్రదించే అవకాశం మరింత సులభమయ్యేదనే అభిప్రాయాలు ఉన్నాయి.ఇప్పుడు బుచ్చిబాబు ముందు మరో కీలక నిర్ణయం ఉంది. మరో స్టార్ హీరో కోసం ఎదురుచూస్తారా? లేక 'ఉప్పెన' తరహాలో కథకు ప్రాధాన్యం ఇస్తూ మీడియం రేంజ్ హీరోతో సినిమా చేస్తారా? రెండో మార్గం కూడా దర్శకుడికి మంచి అవకాశం కావచ్చు. బలమైన కథతో హిట్ కొడితే స్టార్ హీరో అవసరం లేకుండానే మార్కెట్‌ను తిరిగి పెంచుకోవచ్చు.అయితే ఇప్పటికే రామ్ చరణ్‌తో భారీ బడ్జెట్, గ్రాండ్ సెట్స్, పాన్ ఇండియా స్థాయిలో సినిమా చేసిన తర్వాత చిన్న స్కేల్‌కు రావడం అంత సులభం కాదు. ఒకసారి దర్శకుడి రేంజ్ పెరిగిన తర్వాత అదే స్థాయిలో కొనసాగాలనే ఆలోచన సహజంగానే ఉంటుంది. నిర్మాతలు కూడా బుచ్చిబాబును ఇప్పుడు పెద్ద సినిమాల దర్శకుడిగానే చూస్తున్నారు. మరి ఆయన తదుపరి అడుగు ఏ వైపు ఉంటుందో ఆసక్తిగా మారింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com